జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 6 సంచిక 55 | హైదరాబాద్, డిసెంబరు 20 మంగళవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00



ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523


# కార్పొరేట్ సర్కారు వద్దు.. కిసాన్ సర్కార్ కావాలి..

## శుభప్రద్ పటేల్



హైదరాబాద్ : దేశంలో కార్పొరేట్ సర్కారు వద్దని, కిసాన్ సర్కార్ రావాలని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. రైతు, సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, ఆయా పథకాల్లో దేశంలోనే రాష్ట్రం తొలిస్థానంలో నిలిచిందని కితాబిచ్చారు. కర్ణాటకలో రాష్ట్రం గదగ్ జిల్లా ముందర్గి స్టేడియంలో కిసాన్ జాగృతి వికాస్ సంఘ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా శుభప్రద్ పటేల్, వికారాబాద్ జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. కిసాన్ జాగృతి వికాస్ సంఘం ఆధ్వర్యంలో అక్కడ 75 జంటల సామూహిక వివాహాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అన్నం పెట్టే రైతు అప్పులపాలు కాకూడదని, రైతు యాచించే స్థితిలో కాకుండా.. శాసించే స్థాయిలో ఉండాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేస్తుందన్నారు. సాగునీటి సదుపాయంతో పాటు వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారని, దీంతో రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ది లిఫ్ట్ ఇరిగేషన్ కాళేశ్వరం నిర్మించి తెలంగాణ సస్యశ్యామలమైందని చెప్పారు. వ్యవసాయరంగానికి తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న చేయూత దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకున్నా సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలంగాణ విజయవంతంగా అమలుచేస్తుందని చెప్పారు. తెలంగాణలో పెళ్లిల్లు జరిగితే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. 1,00,016 అందజేస్తున్నారన్నారు. తెలంగాణలో రైతు సర్కార్ పాలన ఎలా నడుస్తోందో.. దేశంలో సైతం కిసాన్ సర్కార్ పాలన ఎంతో అవసరమన్నారు. కార్పొరేట్ (ఆదాని, అంబానీ) పాలన వద్దని, కిసాన్ సర్కార్ పాలన కావాలి అనే నినాదంతో సభలో రైతులు హోరెత్తించారు. అనంతరం రైతు సంఘం నాయకులు మఠాధిపతులతో కలిసి గోపూజ, నాగలి పూజ, ధనరాశి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ రైతు సంఘం అధ్యక్షుడు యుగంధర్ నాయుడు, తెలంగాణ రైతు సంఘం ప్రతినిధి గోవింద్ రావు, పలువురు కర్ణాటక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి



బీఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన కు ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. రోహిత్ రెడ్డి ఆర్థిక లావాదేవీలపై ఈడీ ఆరా తీస్తోంది. అయ్యప్ప దీక్షలో ఉన్నందున ఈడీని ఈనెల 31వరకు సమయం కోరానని తెలిపారు. అయితే ఈడీ అధికారులు తన గడువు విజ్ఞప్తిని తిరస్కరించడంతో ఈరోజు విచారణకు వచ్చానన్నారు. విచారణకు తాను పూర్తిగా సహకరిస్తానని రోహిత్ రెడ్డి తెలిపారు. ఏ కేసులో తనను విచారణకు పిలిచారో తెలియదన్నారు.

## తెలంగాణ ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల.. మార్చి 15 నుంచి ఎగ్జామ్స్



హైదరాబాద్ : ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. వచ్చే ఏడాది (2023) మార్చి 15వ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్స్‌ను జరుపనున్నట్లు వివరించింది. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామ్‌ను 2023 మార్చి 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను మార్చి 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్ విభాగం జాయింట్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ తెలిపారు.

## అమరుల ఆశయాలను కొనసాగిద్దాం: అల్లం నారాయణ



పెద్దపల్లి జిల్లా : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయాలను కొనసాగిద్దామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. సోమవారం హన్మకొండ నుంచి పెద్దపల్లి మీదుగా గోదావరిఖని వెళ్తున్న సందర్భంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆయన నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఎన్నో ఆశయాలతో సాధించికున్న తెలంగాణను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలుపరుస్తుందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమంతో బంగారు తెలంగాణను తయారుచేస్తున్న ప్రభుత్వానికి మనమంతా రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు అల్లం నారాయణకు పూలబొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. జర్నలిస్టులు వేణుగోపాల్, మల్లేష్, తిరుపతి గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అర్జెంటీనాలో అంబరాన్నంటిన సంబరాలు



ఖతార్ లో జరిగిన ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ లో అర్జెంటీనా ఘన విజయం సాధించింది. అత్యంత ఉత్కంఠగా సాగిన తన ఆట పదునుతో ఈ పోటీలో అర్జెంటీనా ట్రోఫీ విన్నర్ గా లియోనాల్ మెస్సీ నిలిచారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ క్రీడాభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఆ దేశంలోనూ అంబరాన్నంటేలా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అర్జెంటీనాలో అత్యంత ప్రసిద్ధి గాంచిన సెంట్రల్ బ్యూనోస్ ఎయిర్స్ లోని ఒబెలిస్క్ వద్దకు భారీ సంఖ్యలో ఫుట్ బాల్ ఫ్యాన్స్, ప్రజలు వచ్చి చేరారు. పటాసులు పేలుస్తూ, డ్యాన్సులు చేశారు. సుమారు 20 లక్షల మందికి పైగా జనం ఒక చోట చేరి.. ఆ దేశ జెండాను రెపరెపలాడిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ విజయంతో తాము చాలా సంతోషంగా ఉన్నామని అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపుతో తమ కష్టాలను కొన్ని రోజులైనా మర్చిపోయి బతుకుతామని అంటున్నారు. దేశంలోని 4.5 కోట్ల ప్రజల్లో 40 శాతం మంది ప్రజలు పేదరికంలో ఉన్నవారే. అయితే ఆర్థికంగా దేశం ఎన్నో కష్టాలను చూస్తోందని, నెలాఖర్లో అవసరాలు తీరడం కష్టంగా ఉంటుందని ఓ నిర్మాణ రంగ కార్మికుడు పేర్కొనడం గమనార్హం. కానీ, తాము బాధపడిన ప్రతిదానికీ ఈ విజయం ప్రతిఫలాన్నిచ్చిందన్న ఆనందం వ్యక్తం చేశాడు.



## ముందస్తుకు వెళ్లేందుకు కేసీఆర్ లీకులు ఇస్తున్నారు : రఘునందన్ రావు

మెదక్ :ముందస్తు ఎన్నికలకు వెళ్తారని సీఎం కేసీఆర్ లీకులు ఇస్తున్నారని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆరోపించారు. జమిలి ఎన్నికలు జరిగితే సీఎం కేసీఆర్‌కు (మిగతా 2లో..)

# తెలంగాణ కాంగ్రెస్ ఎపిసోడ్ పై ఏఐసీసీ సీరియస్



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎపిసోడ్ పై ఏఐసీసీ సీరియస్ అయ్యింది. టీ కాంగ్రెస్ లో పరిణామాలు, నేతల మధ్య విభేదాలపై ఏఐసీసీ దృష్టి పెట్టింది. పార్లమెంట్ సమావేశాలు ముగిశాక టీ కాంగ్రెస్ వ్యవహారాలను చక్కదిద్దేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు ప్లాన్ చేస్తున్నారు. దీనిపై ఏఐసీసీ సెక్రటరీ నదీమ్ కు ప్రియాంకా గాంధీ ఫోన్ చేశారు. టీ కాంగ్రెస్ తో జరుగుతున్న పరిణామాలపై ఆరా తీశారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి: ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ కి టీడబ్ల్యూజేఎఫ్ వినతి



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గత నెల 27న హైదరాబాద్ లో జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభలో ఆమోదించిన పలు తీర్మానాలు, ఫెడరేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గంతో కూడిన ప్రతిని ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సోమవారం సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళిని కలిసి సమర్పించారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న జర్నలిస్టుల ఇండ్లు ఇళ్ళస్థలాల సమస్యతో పాటు చిన్నపత్రికల సమస్యలు, జర్నలిస్టు బంధు పథకం, పెన్షన్ విధానం, ఆరోగ్య భీమా, అక్రెడిటేషన్ కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఎర్రం నర్సింగ్ రావు, ఎస్ కే సలీమా, హెచ్ యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా బార్డర్‌లో చైనా డ్రోన్లు, ఫైటర్ జెట్స్



అరుణాచల్ ప్రదేశ్ లోని తవాంగ్ సెక్టార్ వద్ద డిసెంబరు 9న భారత బలగాలతో ఘర్షణ జరిగిన నేపథ్యంలో బార్డర్ లో చైనా దూకుడు పెంచింది. భారత సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉండే వైమానిక స్థావరాలను యాక్టివేట్ చేసింది. టిబెట్‌లోని బాంగ్డా, లాసా, షిగాత్సే ప్రాంతాల్లో ఉన్న తన వైమానిక స్థావరాలను అత్యాధునిక డ్రోన్లు, యుద్ధ విమానాలతో నింపుతోంది. ఇది వాస్తవమేనంటూ పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. టిబెట్ లోని బాంగ్డా, లాసా, షిగాత్సే వైమానిక స్థావరాలలో పెద్ద సంఖ్యలో 'డబ్ల్యూజడ్-7 సోరింగ్ డ్రాగన్' రకం డ్రోన్లు, 'సుఖోయ్ ఎస్‌యూ 27' రకం యుద్ధ విమానాలను చైనా మోహరించిందని నిర్ధారించే పలు శాటిలైట్ దృశ్యాలతో తాజాగా కథనాలను ప్రచురించాయి. ఆ ఉపగ్రహ చిత్రాలు డిసెంబరు 14 నాటివని కథనంలో పేర్కొన్నాయి.

**చైనా విమానాలు చక్కర్లు కొడుతూ రెండుసార్లు..**

ఇటీవల కాలంలో అరుణాచల్ ప్రదేశ్ లోని భారత గగన తలంలో చైనా విమానాలు చక్కర్లు కొడుతూ (మిగతా 2లో..)




## వెన్న అశోక్ కుమార్ దంపతులను పరామర్శించిన...పినపాక నియోజకవర్గం యువజన విభాగం బి. ఆర్. ఎస్ పార్టీ నాయకులు



అశ్వాపురం ( ప్రజా పాలన.): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి. ఆర్. ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చింతిర్యాల కాలనీ గ్రామానికి చెందిన పినపాక నియోజకవర్గ బి. ఆర్. ఎస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు స్థానిక ఉపసర్పంచ్ వెన్న అశోక్ కుమార్ – సునీత దంపతులు గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న పినపాక నియోజకవర్గం యువజన విభాగం బి. ఆర్. ఎస్ పార్టీ నాయకులు . ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోశెట్టి రవి ప్రసాద్, పినపాక నియోజకవర్గం యువజన విభాగం ప్రధానకార్యదర్శిలు పద్దం శ్రీను, బానోత్ రమేష్, మణుగూరు టౌన్ యువజన విభాగం ప్రధానకార్యదర్శి గుర్రం సృజన్, పినపాక నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షులు యంపాటి సందీప్ రెడ్డి, అశ్వాపురం మండలం యువజన విభాగం ఉపాధ్యక్షులు వెన్న రంజిత్ కుమార్,మరియు యువజన నాయకులు చెలికాని రామకృష్ణ, గాజుల కార్తీక్, తోటమల్ల శివశంకర్ తాళ్లపల్లి నాగరాజు, దేగల సంపత్ తదితరులు పాల్గొన్నారు

## దశ దిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ తాత మధు



బూర్గంపాడు (ప్రజా పాలన.): ఇటీవల మరణించిన ఇరవెండి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల నాయకులు వల్లూరిపల్లి వంశీకృష్ణ మాతృ మూర్తి వల్లూరిపల్లి రజిని కుమారి దశ దిన కార్యక్రమానికి హాజరై వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఎమ్మెల్సీ తాత మధు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య , బూర్గంపాడు మండల జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు, పినపాక శాసన సభ్యులు శ్రీ రేగా కాంతారావు ,సతీమణి శ్రీమతి : రేగా సుధారాణి లిమణుగూరు మండల ఎంపీపీ కారం విజయ కుమారి , బిఆర్ఎస్ పార్టీ బూర్గంపాడు మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి మండల మహిళా అధ్యక్షురాలు ఎల్లంకి లలిత ,ఇరవెండి సర్పంచ్ కోర్సు లక్ష్మి కోయగూడెం సర్పంచ్తు తుపాకుల రామలక్ష్మి మోతె సర్పంచ్ పోతునూరి సూరమ్మ వార్డు నెంబర్స్, తదితర పార్టీ నాయకులు,పాల్గొన్నారు.

## నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా నూతన కమిటీ ఎన్నిక




మంచిర్యాల టౌన్, డిసెంబర్ 19, ప్రజాపాలన: నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా నూతన కమిటీ ఎన్నిక విద్యార్థి సంఘము, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జుమ్మిడి గోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున మంచిర్యాల పట్టణం లోని ఎస్ ఆర్ ఆర్ జూనియర్ కాలేజి లో జిల్లా సదస్సు నిర్వహించారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు గా ముడిమడుగుల శేఖర్,ఉపాధ్యక్షులుగా సోదారి శ్రావణ్,జిల్లా ప్రధాన కార్యదర్శి గా మీసాల రాజు,సహాయ కార్యదర్శి గా శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పాయిడి మల్లికార్జున్, కోశాధికారి గా గోళ్ళ సాయి, జిల్లా నాయకులు గా రంజిత్, సంతోష్, రమేష్,రాజేష్,మహేష్, ఆనంద్ లకు నియామక పత్రాలు అందజేశారు.

## రోడ్డు దాటుతుండగా కారు డీకొని వృద్దుడికి తీవ్ర గాయాలు



శంకరపట్నం ప్రజాపాలన రిపోర్టర్ డిసెంబర్ 19: శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన పెద్దవేణి ఐలుమల్లు (60) సోమవారమునాడు గొల్లపల్లి గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద రోడ్డు దాటుతుండగా హుజురాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఈఎంటి సురేష్, పైలెట్ గోపీకృష్ణ లు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని ప్రధమ చికిత్స అందిసత్తూ హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి షాక్.. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిక



మణుగూరు ( ప్రజా పాలన.):పినపాక నియోజకవర్గనికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మంత్రి కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిక గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం ఈరోజు హైదరాబాద్ ప్రగతి భవన్ లో : బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ %ు% ఐటీ పురపాలక శాఖ మంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల తారక రామారావు సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ %ు% పినపాక శాసనసభ్యులు %ు% భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ జిల్లా ల అధ్యక్షుడు శ్రీ రేగా కాంతారావు ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గనికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అక్కిరెడ్డి సంజీవరెడ్డి, వారితోపాటు కరకగూడెం సర్పంచ్ ఊకే రామనాథం, మదర్ సాహెబ్, సోమరాజు,కుడితిపుడి కోటేశ్వరరావు, బూర నర్సయ్య,గోగ్గలి నరసయ్య, సుబ్బారావు, నిమ్మ లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఆ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు వారికి వారందరికీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ %ు% మంత్రి కేటీఆర్ గులాబీ కండవా కప్పి పార్టీలోకి స్వాగతం ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు మాట్లాడుతూరాష్ట్రానికి దేశానికి ఎప్పటికైనా సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని అన్నారు, సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సహకారమవు అవుతున్నదని అన్నారు, దేశంలోనే అత్యంత ప్రతిభావంతుడైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో ఐటీ పరిశ్రమలు మున్సిపాలిటీ తదితర శాఖలలో సరికొత్త సంస్కరణలతో పాటు దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తున్నదని అన్నారు, నేడు అన్ని రంగాలలో తెలంగాణ దేశానికే రోల్ మడల్ అని తెలిపారు, ప్రపంచంలోనే భారత్ ను రోల్డ్ మోడల్ గా నిలిపే సత్తా సీఎం కేసీఆర్ కే ఉన్నదని దేశ ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారని అన్నారు, రాష్ట్రంలోని రైతంగానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్తును 12,000 కోట్లతో ఉచితంగా అందిస్తున్నారని అందుబాటులో ఉన్న వనరులతో దేశం మొత్తం ఉచిత విద్యుత్తు అందిస్తూ వస్తున్నామన్నారు.

## మండలంలోని గ్రామాలలో కిరాణా షాపులలో మద్యం అమ్మకం



జన్నారం, డిసెంబర్ 19, ప్రజాపాలన: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న కిరాణా షాపుల్లో మద్యం అమ్ముతున్నారని ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా ఉ పాధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్య అన్నారు. సోమవారం మండలంలోని గ్రామలలో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపులను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని 29 గ్రామపంచాయతీలు 34 గ్రామాలలో ప్రతి కిరణ షాపు బెల్ట్ షాప్ గా మారిందన్నారు. ముఖ్యంగా కొన్ని గ్రామాల్లో పాఠశాలలకు, దేవాలయాలకు కనీసం వంద మీటర్ల దూరం కూడా లేకుండా బెల్ట్ షాపులు నడపడం విడురంగా అనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు దేవాలయాలకు దగ్గరకు కిరాణా దుకాణాల్లో మద్యం బాటిళ్లు అమ్ముతున్నారని, మద్యం బాటిళ్లు బెల్ట్ షాపు దగ్గర కోని, గ్రామంలో కిరాణా షాపుల్లో విక్రయిస్తుదన్నారు. ఇలాంటి వాటిపై అధికారులు అవగాహన సదస్సులు జరిపి గ్రామాల్లో అనుమతి లేని కిరాణా షాపులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎన్ని చట్టాలు వచ్చిన ఇలాంటి వాటిని అరికట్టాడంలో అధికారులు విపలమవుతుదన్నారు. పోలీస్ మండల అధికార యంత్రాంగం స్పందించి కనీసం పాఠశాల, దేవుని గూడి దగ్గర వున్న కిరాణా షాపుల్లో బెల్టు షాపులు జరుగకుండ చూసి అమ్మే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజా ప్రతినిధిని రీకాల్ చేసే హక్కు కల్పించాలి: తీన్మార్ మల్లన్న



బెల్లంపల్లి డిసెంబర్ 19 ప్రజా పాలన ప్రతినిధి: ఓటు ద్వారా ప్రజా ప్రతినిధులను ఏ విధంగా గెలిపించి ఎన్నుకుంటావెూ, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రజాప్రతినిదిని ఆ పదవి నుండి రీకాల్ చేసే అధికారాన్ని కూడా కల్పించాలని ఓటర్లను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా యాత్ర చేపట్టినట్లు "క్యూ న్యూస్" ప్రతినిధి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న అన్నారు.సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజలను చైతన్యవంతం చేసే యాత్రలో భాగంగా బెల్లంపల్లి కి వచ్చిన ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడారు,తెలంగాణ ఉద్యమం పేరు చెప్పి కెసిఆర్ తన కుటుంబ సభ్యుల ఆస్తులు 2004లో 47 లక్షలు ఉండగా ప్రస్తుతం నాలుగు లక్షల కోట్లకు ఎలా చేరిందని ఆయన ప్రశ్నించారు, 16 వేల కోట్ల మిగిల్ బడ్జెట్ తో తెలంగాణను అప్పగిస్తే, ప్రస్తుతం ఒక్కొక్కరి తల మీద 1 లక్ష,50 వేల రూపాయల అప్పు భారాన్ని పెట్టాడని ఇది ప్రజలకు మేలు చేసినట్లా, కీడు చేసినట్లా అని అన్నారు.ధరణి పేరుతో అనుభవదారు కాలం తీసేస్తే మూడు లక్షల ఎకరాల భూమిని వదిలిపెట్టి పోయిన దొరలు మళ్ళీ వారి చేతుల్లోకి తీసుకున్నారని, తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ వంద సంవత్సరాల వెనక్కి తీసుకుపోయారని అన్నారు. 32 లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు మొదలుపెట్టి 1 లక్ష,32 కోట్లతో పూర్తి చేశారని, లక్ష కోట్ల రూపాయలు ఎటుపోయినాయని అన్నారు, నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టుతో పంట పొలాలకు నీరు అందిస్తే, కరెంటు మోటార్లకు ఇంకా కరెంటు ఎందుకని ఆయన ప్రశ్నించారు.ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్, సంస్థల నుండి అప్పులు తీసుకొని చెల్లించకుండా ఆ సంస్థల ను నిర్వీర్యం చేస్తున్నాడని, ఆంధ్రాలో మాదిరిగా ఆర్టీసీని ప్రభుత్వ ఆధీనంలో నడపాలని, సింగరేణి కార్మికులకు రైతులకు మాదిరిగానే వృత్తి పన్ను ఐటి నుండి మినహాయింపు ఇవ్వాలని, వివిధ సంస్థలకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఉచితాల పేరుతో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడమే కాకుండా ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారని, కెసిఆర్ చేపట్టే ప్రతి పథకం నిధులు లేక నిరసించి ఆగిపోతున్నాయని, రానున్న ఎన్నికల అనంతరం రైతుబంధు కూడా ఇవ్వడని ఆయన జోష్యం చెప్పారు.7200 సంఖ్యకు అర్థం ఏమిటని విలేకరులు ప్రశ్నించగా రాష్ట్రంలో 7200 మంది అవినీతిపరులుగా, ప్రజా వ్యతిరేక ప్రజా ప్రతినిధులు ఉన్నారని, ఆ సంఖ్యను జీరోకి తీసుకురావడానికి తను ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దాసరి భూమయ్య, మార్నింగ్ న్యూస్ పత్రికల విశ్లేషకుడు సుదర్శన్, పలువురు డప్పు కళాకారులు, తదితరులు, పాల్గొన్నారు.

## జాతీయ బిసి కమిషన్ చైర్మన్‌ను సన్మానించిన బిజెపి నాయకులు



బెల్లంపల్లి డిసెంబర్ 19 ప్రజా పాలన ప్రతినిధి: వెనుక బడిన తరగతుల జాతీయ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం ఆహిర్ ను బెల్లంపల్లి పట్టణంలో ఆదివారం నియోజక వర్గ ఇంఛార్జి కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పూల మాలలు, శాలువాలతో, ఘనంగ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, హన్సరాజ్ నియామకం వల్ల బిసి సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో మేలు చేకూరుతుందని, ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ ఇంఛార్జి కొయ్యల ఏమాజి, జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, రాజులాల్ యాదవ్, గోవర్దన్, రామయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏడి విచారణకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పరిశీలించగలరని వినతి

తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి తాండూర్ శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి ఏడి విచారణకు ఈరోజు హాజరు కావాల్సి ఉండగా ఆర్థిక వివరాలు సరిగ్గా లేకపోవడంతో హాజరు కాలేరని తెలుస్తోంది . డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు అదేవిధంగా తాండూర్ లో ఇసుక అక్రమ రవాణా, దళిత బంధు అక్రమల ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన అనుచరులు చేస్తున్నారని విశ్వాసంగా సమాచారం. తాండూర్ ఎమ్మెల్యే ఏడి హాజరయ్యా రు




మీరు ఇల్లు / స్థలం కొనాలనుకుంటున్నారా...
లేదా అమ్మాలనుకుంటున్నారా?
అయితే ....
ఈ ప్రకటన మీకోసమే
సంప్రదించండి
8886911944

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING
20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి
BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు
SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.
స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది
అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం
అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది
మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్
జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

# ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 20, డిసెంబరు 2022


## అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్

దేశ రాజకీయాలలో కేసీఆర్‌ది ఒక ప్రత్యేక శైలి. తన 40 ఏండ్ల రాజకీయ జీవితంలో అనేక ఎత్తుపల్లాలు, జయాపజయాలు ఎదురైనా దృఢసంకల్పంతో ముందుకెళ్తూ తనదైన రాజకీయ పంథాను సృష్టించుకున్న విలక్షణమైన నేత. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంతో, రాష్ట్ర సాధనతో దేశంలో ఒక బలమైన సంకల్పం గల నాయకునిగా, దార్శనికుడైన పరిపాలకునిగా కేసీఆర్ ముద్ర వేసుకున్నారు. ఇప్పుడు దేశంలో గుణాత్మక మార్పును సాధించటానికి బయలు దేరారు. మన దేశంలో అన్ని రకాల వనరులున్నా సాధించాల్సిన అభివృద్ధిని సాధించటం లేదన్నది కేసీఆర్ భావన. అందుకే టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చి 'అబ్ కీ బార్%ఀా% కిసాన్ సర్కార్' అనే నినాదంతో ముందడుగు వేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి జాతీయ అధ్యక్షులుగా వ్యవహరించిన నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు.. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పాటైన నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌లకు నాయకత్వం వహించిన ఎన్టీఆర్, చంద్రబాబుల తర్వాత దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న తెలుగు వ్యక్తి కేసీఆర్ మాత్రమే. బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేసి ముందుకెళుతున్న కేసీఆర్.. 'ఈసారి రైతుల రాజ్యం' అని నినాదం ఇవ్వటం సర్వత్రా ఆసక్తిని రేకెత్తించింది. మోదీ ప్రభుత్వం గత ప్రభుత్వాలకు భిన్నం గా, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. అగ్నిపథ్, పెద్దనోట్ల రద్దు, సాగుచట్టాలు, పౌరసత్వ బిల్లు, 370 ఆర్టికల్ రద్దు వంటి అనేక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకున్నది. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు మోదీ సర్కారు పరిష్కారం చూపలేకపోయింది. 45 ఏండ్ల గరిష్ఠ స్థాయికి చేరిన నిరుద్యోగం, పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, పడిపోతున్న వృద్ధి రేటు, రూపాయి విలువ పతనాన్ని ప్రభుత్వం అడ్డుకోలేక పోయింది. కార్పొరేట్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ విలువైన ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించుకొంటున్నది. భారతదేశం వ్యవసాయిక దేశం. స్వాతం త్ర్యం వచ్చే నాటికి జనాభాలో 72 శాతం మంది ప్రజలు జీవనోపాధి కోసం వ్యవసాయ రంగంపైన ఆధారపడి ఉన్నారు. నేటికీ ఈ సంఖ్య 50 శాతం కంటే ఎక్కువగానే ఉన్నది. 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో ప్రణాళికల రూపంలో వ్యవసాయ రంగంపై రూ.లక్షల కోట్లు ఖర్చు చేసినా రైతుల స్థితిగతులు మాత్రం మారలేదు. వ్యవసాయాన్ని పండుగగా, రైతును రాజును చేస్తామన్న ప్రభుత్వాల హామీలు నెరవేరలేదు. భూసంస్కరణలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవటం, హరిత విప్లవం ఫలాలు రైతులందరికీ చేరకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ఎరువుల ధరలు పెరగటం, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించకపోవటం, సేద్యం ఖర్చులు పెరగడంతో రైతు దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేయబడ్డాడు. ఈ నేపథ్యంలో, రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేసీఆర్ ముందుకు వస్తున్నారు. దేశంలో కిసాన్ సర్కార్ వస్తేనే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నది కేసీఆర్ విశ్వాసం. రైతు రాజ్యం కోసం, రైతుని రాజును చేయటం కోసం కిసాన్ సర్కార్ ప్రతిపాదన దేశం ముందు పెట్టారు. దేశంలో రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ముందు వరుసలో ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు, రైతు బీమా, రైతు వేదికలు, రైతు సమన్వయ సమితి, అనేక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంట కొనుగోలు కేంద్రాలు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ లాంటి అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. దీంతో రాష్ట్రంలో వ్యవసాయం స్వరూపమే సమూలంగా మారిపోయింది. పెద్దఎత్తున వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. 'దుక్కి లేకపోతే దిక్కు లేదు' అని బలంగా నమ్మిన నాయకుడు కేసీఆర్. తెలంగాణలో విజయవంతమైన వ్యవసాయ విధానాన్ని దేశవ్యాప్తం చేయటం ద్వారా అద్భుత ఫలితాలు సాధించగలమని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే కిసాన్ సర్కార్ ప్రతిపాదన తెస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎంత బలంగా ఉన్నానని చెప్పుకొంటున్నప్పటికీ.. పశ్చిమ బెంగాల్, హిమచల్ ప్రదేశ్ ఎన్నికల్లో ఓడిపోయింది. అంటే, విపక్షాలు బలంగా పోరాడితే 2024 ఎన్నికల్లో బీజేపీకి జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయడం పెద్ద కష్టమేమీ కాదన్నది నిజం. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ భారత రాష్ట్ర సమితి ద్వారా విపక్షాల మధ్య ఐక్యతను తీసుకొచ్చి, వాటిని సమన్వయం చేయగలిగితే బీజేపీని ఓడించడం అసాధ్యమేమీ కాబోదు. రానున్న కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ప్రతిపక్షాలు అడ్డుకోగలిగితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూల రాజకీయ వాతావరణం ఏర్పడుతుంది. బెంగాల్, తమిళనాడు, బీహర్, యూపీ, తెలంగాణ, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో 200 లకు పైగా లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిల్లో బీజేపీ యేతర పార్టీలు బలం పుంజుకొంటే బీజేపీని అధికారంలోకి రాకుండాఅడ్డుకొనే అవకాశం ఉన్నది. బలహీన స్థితిలో కాంగ్రెస్ ఉండటం, విపక్షాల మధ్య ఐక్యత లేకపోవడం బీజేపీ బలంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే బీఆర్‌ఎస్‌తో కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి దిగారు. కేసీఆర్ వ్యూహచతురత, దార్శనికత వల్లనే తెలంగాణ సాధ్యమైంది. బీఆర్‌ఎస్ దేశవ్యాప్తంగా బలమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవిస్తుందనడంలో సందేహం లేదు. కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే లక్ష్యంతో సాగు చట్టాలు తీసుకొచ్చి 700 మంది రైతుల చావుకు కారణమైంది మోదీ ప్రభుత్వం. వారి కుటుంబాలను కేంద్రం పట్టించుకోకపోయినా కేసీఆర్ వారికి ఆర్థిక సాయం అందించారు. కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిలదీస్తున్న కేసీఆర్ కిసాన్ సర్కారు ప్రతిపాదనకి దేశవ్యాప్తంగా మద్దతు లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# నేను తాకానని.. రిజిస్టర్‌ను శుద్ధి చేశారు!

### కేంద్రసాహిత్య అకాడమీ అవార్డ్ గ్రహీత, పద్మ కొలకలూరి ఇనాక్

పెనుతుపాన్లకి మహావృక్షాలు కూలొచ్చేమో కానీ గడ్డిపోచకేమీ కాదు. జీవితంలో తుపానులాంటి పరిణామాలనీ అలాగే దాటొచ్చారు కొలకలూరి ఇనాక్. గడ్డిపోచలాగే పెనుగాలులకి తలొంచి తప్పించుకుని స్నేహానికి చేయిచాచారు. కూకటివేళ్లతోసహా తనని పెకలించాలనుకున్న చేతుల్ని ఆర్తిగా హత్తుకున్నారు! తనని తక్కువ కులస్థుణ్ణి చేసి ఏడిపించేవాళ్లు... ఓ చారిత్రక పరిణామం చేతిలో పావులు మాత్రమేనని నమ్మారు. ఆ నమ్మకాన్నే కన్నీటి సిరాతో కథలుగా చెప్పారు! ఆ సిరా వెనక ఏముందో ఇలా చెప్పుకొచ్చారు... మట్టిలో ఆడుకుంటున్నవాణ్ణల్లా రెక్కలు పట్టుకుని తీసుకొచ్చి మరీ నన్ను ఆ కొత్త వ్యక్తి ముందు నిలబెట్టారు. ఆయన్ని చూపించి 'దండం దొరా... అని చెప్పరా!' అన్నాడు మానాన్న. దండం ఎలా పెట్టాలో కూడా చూపించాడు. ఆ వచ్చిన వ్యక్తి వెళ్లిపోయాక నాన్న 'ఆయన మన స్వామి. ఆయన పొలంలో మనం జీతగాళ్లం. దొర వచ్చినప్పుడు మంచంపైన కూర్చోకూడదు. ఎదుటపడ్డా పక్కకు జరగాలి. ఆయన్ని ముట్టుకోకూడదు. దూరంగా నిల్చునే మాట్లాడాలి!' అని చెప్పాడు. ఊహ తెలిసి నేను నేర్చుకున్న మొదటి 'సామాజిక' పాఠం అదే. వయసు పెరిగేకొద్దీ ఇంకొన్ని నియమాలనీ నేర్చుకున్నా. మా ఊరి చివర్న మా పల్లె ఉంటే... మరో చివర చింతతోపు ఉండేది. ఆ తోపులోనే ఆడుకుంటూ ఉండేవాళ్లం. అక్కడి నుంచి ఊరి ప్రెసిడెంటుగారుండే వీధి మార్గంలో వస్తే పది అడుగుల్లో మా ఇళ్లకు చేరుకోవచ్చు. కానీ ఆ వీధిలోకి నేను అడుగుపెట్టకూడదని చెప్పారు. నడిస్తే ఒళ్లు చీరేస్తారని భయపెట్టారు. ఓరోజు ఆటల్లో పడి మరచిపోయి అటువైపుగా వెళ్లిపోయా! వెళితే అక్కడే కూర్చుని ఉన్నారు ప్రెసిడెంటు. 'ఎవడ్రా...' అన్నాడుగుడ్లురుముతూ. ఆయన అనుచరులు నా రెక్కలు లాగి పట్టుకుని 'ఊరిచివర బుడ్డోడండీ!' అన్నారు. 'ఇంకొక్కసారి ఇలా వస్తే కొంకలిరగ్గొడతా!' అన్నాడు. వాళ్లు గట్టిగా పట్టుకోవడంతో రెక్కలు బాగా నొప్పి పుట్టి ఏడుస్తూ ఇంటికెళ్లాను. అలా ఊర్లోకి వెళ్లడం నాకు తెలియకుండా చేసినదైతే... తెలిసి చేసిన 'అపచారం' ఇంకొకటుంది. మా ఊర్లో వీధి పాఠశాలని 'సత్రం బడి' అనేవారు. అక్కడి అయ్యోరు దీర్ఘాలు తీస్తూ 'క కాకి దీర్ఘమిస్తే కా...' అని చెబుతుంటే వినడం సరదాగా ఉండేది. ఓసారి రహస్యంగా బడి చివర్న నిల్చుని వింటూ ఆయన కంటపడ్డా. 'నువ్వెందుకు వచ్చావురా...!' అంటూ కొట్టబోతే పరుగెత్తి వచ్చేశాను. అప్పట్నుంచీ రోజూ అలా చాటుగా పాఠాలు వినడం, ఆయన కొట్టబోతే పరుగెత్తుకు రావడం ఓ ఆటలా అనిపించేది. అప్పట్లో సరదాగానే ఉన్నా దాని వెనకున్న విషాదం, వివక్ష తర్వాతర్వాతే అర్థమయ్యాయి!

**పేరు అలా వచ్చింది...**

అప్పుడే మా ఊరికి కొత్తగా ఏబీఎం క్రైస్తవ బడి వస్తే, నన్ను అందులో చేర్చారు. అక్కడ చేర్చేటప్పుడు నా పేరేమిటో ఎవరికీ తెలియలేదు! నాకు 'ఇనాక్' అనే పేరుని గుంటూరు నుంచి వచ్చిన క్రైస్తవ మిషనరీ ఎవరో పెట్టారు. కానీ అది నోరు తిరక్క



నూకలయ్యా, ఎకోనా అనే పిలుస్తుండేవారు. నన్ను బడిలో చేర్చడానికొచ్చిన అయ్యవారు ఆ రెండు పేర్లకి దగ్గరగా ఉన్న బైబిల్ పదం 'ఇనాక్' అన్నదే నా పేరై ఉంటుందని ఊహించి అటెండెన్స్‌లో రాశారు. నాకూ పదో తరగతి దాకా ఆ పేరు స్పెల్లింగ్ సరిగ్గా రాయడం రాదు! అలా చేరిన నేను మూడో తరగతిలోనే బడి మానేయాల్సి వచ్చింది. మా రైతు దగ్గర నాన్నతోపాటూ జీతగాడిగా చేరాల్సి వచ్చింది. ఆ రోజు నుంచీ పశువుల్ని కాసుకురావడం, పేడ తీయటం, వాటిని కడగడం, కుడితి పెట్టడం ఇవే నా పనులయ్యాయి. అలాగే సాగితే నా జీవితం ఏమయ్యుండేదో తెలియదు కానీ... మా పల్లెకొచ్చిన దేవదాస్ మాస్టారు నా గీత మార్చాడు. నాలాగా జీతాలకెళుతున్న పిల్లలకి సాయంత్రంపూట ఆయనే పాఠాలు చెప్పేవాడు. నా చేత ఎంట్రన్స్ రాయించి నేరుగా ఫస్ట్‌ఫారమ్‌లో చేర్పేశాడు. జీతగాడిగా ఉండిపోవాల్సిన నా జీవితంలో చదువుల దీపం వెలిగించింది ఆయనే. కానీ మూడేళ్లకి మళ్లీ ఆ దీపం కొడిగట్టే పరిస్థితొచ్చింది. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు మా నాన్న చనిపోయాడు. అమ్మ ఆ బాధతో మంచానపడడంతో... పట్టించుకునేవాళు లేక నేనూ, మా చెల్లెలూ, తమ్ముడూ దిక్కులేనివాళ్లమైపోయాం.

**గట్టి మనిషే...**

మా అమ్మవాళ్లు 14 మంది సంతానం. తనే చివరిపిల్ల కావడంతో కాస్త గారాబంగానే పెంచారు. తల్లిని కోల్పోయి సవతి తల్లి ఆగడాలు భరించలేక ఇల్లొదిలి... మేనమామల పంచన చేరిన నాన్నని అమ్మమ్మవాళ్లు ఇల్లరికం తెచ్చుకున్నారు. ఏ ఆస్తీలేకుండా అనాథగా వచ్చినవాడు కాబట్టి... ఆయన్నీ, ఆయనకు పుట్టిన సంతానమైన మమ్మల్నీ మా బంధువులందరూ చిన్నచూపు చూసేవాళ్లు. 'అలగావోడు' అనే పిలిచేవాళ్లు నన్ను. ఓ రకంగా మేం అగ్రకులాల వాళ్ల నుంచే కాకుండా మావాళ్ల నుంచీ తీవ్రమైన వివక్ష ఎదుర్కొనేవాళ్లం. నాన్న అవన్నీ పట్టించుకోడు. వేకువన మా 'ఆసామి' పొలానికెళ్లి... రోజంతా కష్టపడటం తప్ప ఆయనకేమీ పట్టదు. కానీ అమ్మ అలాకాదు. తిరగబడేది. తిట్టేదీ కొట్టేదీ కూడా. ఒకస్థాయిలో బంధువుల నుంచి దూరంగా ఉండాలనుకుని పల్లెకి దూరంగా సర్కారువాళ్లు చూపిన స్థలంలో ఇల్లుకట్టించింది. నాన్న జీతానికి పోతే వచ్చే వడ్లకి తోడు పశువుల్ని పెంచి పాలమ్మీ, కోళ్లని పెంచీ డబ్బు పోగేసేది. ఆ డబ్బుతోనే ఎకరం పొలం కొంది! అలా అమ్మవల్ల తొలిసారి నాన్న జీవితంలో ఆస్తిపరుడయ్యాడు. కానీ అది జరిగిన ఏడాదిన్నరకే అనారోగ్యంతో చనిపోయాడు. ధైర్యంగా ఉండాల్సిన అమ్మ కుంగిపోయింది. పశువులూ, కోళ్లన్నింటినీ అమ్మి, పొలం కౌలుకిచ్చి ఇంట్లోనే కూర్చుండిపోయింది. నేను చదువు మానేసే పరిస్థితిలో పడ్డాను. కానీ మా అదృష్టం బావుండేమో సర్కారు ఎస్సీ హాస్టళ్లని తెరిచింది. మా మేష్టార్లతో మాట్లాడి తమ్ముణ్ణీ, చెల్లెల్నీ చేర్చాను. నేనూ హాస్టల్లో చేరాను. పదో తరగతి గట్టెక్కాను.

**'పులుల బోను'లోకి...**

టెన్త్‌దాకా క్రైస్తవ స్కూలు, ఇంటర్‌లో గుంటూరు ఏసీ కాలేజీలో చదవడం వల్ల నేనెక్కడా పెద్దగా వివక్షను ఎదుర్కోలేదు... మా ఊరి నుంచి గుంటూరుకి వెళ్లే రైల్లో తప్ప. రైల్లో సీటుదొరికిందికదాని కూర్చుంటే మా గ్రామంలోని అగ్రకులస్థులు ఒప్పుకునేవారు కాదు. నాకన్నా చిన్నపిల్లలైనా సరే నన్ను 'రేయ్ లేచి... అటుపోయి నిల్చో!' అనేవారు. నోరుమూసుకుని వెళ్లేవాణ్ణి. వాళ్ల కంటపడటం ఎందుకని రైలెక్కగానే మరుగుదొడ్డి పక్కనున్న ఖాళీ స్థలంలోకెళ్లి నిల్చునేవాణ్ణి. కంపే... కానీ ఏం చేస్తాను! వీటన్నింటికీ పరాకాష్ట అనిపించే అనుభవాలు వాల్తేరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎదురయ్యాయి. అది నాకో పులిబోనులాగే అనిపించింది. బీఏ ఆనర్స్ క్లాసులోకి వెళ్లిన తొలిరోజే మొదటి బెంచీలో కూర్చున్నా. మిగతా విద్యార్థులొచ్చి 'ఇంకెప్పుడూ ఇక్కడ కూర్చోకు. వెనక బెంచీలో కూర్చో పో..!' అని కసురుకున్నారు. రోజూ మాస్టారు రాకముందే నా సహాధ్యాయి ఒకడు చాక్‌పీస్, డస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ తెచ్చేవాడు. ఓసారి అతను రాకపోతే నేను వెళ్లి తెచ్చా. అది తెలుసుకుని మాస్టారు అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. ఆ రోజంతా ఆయన ఆ మూడింటినీ తాకకుండానే పాఠం చెప్పాడు! తర్వాతి రోజు అటెండెన్స్‌పైన ఉన్న షీటు తీయించి పసుపు నీళ్లు చల్లి... శుద్ధిచేశాకే ముట్టుకున్నారు. మూడేళ్లూ అలాగే గడిచాయి. నన్ను శత్రువులా చూసే కొందరు విద్యార్థులు ఆనర్స్ చివరి పరీక్ష రాయనీయకుండా చేయడానికి... మా అమ్మ చనిపోయినట్టు టెలిగ్రాము కూడా ఇప్పించారు! అది బోగస్ టెలిగ్రామ్ అని చివరి నిమిషంలో తెలుసుకుని ఆగిపోయా. మూడేళ్లపాటు ఇలాంటివెన్నో జరిగాయి. ఒకస్థాయిలో నా లోలోపలి మనిషి తిరగబడమనేవాడు. పిడికిలి బిగించి కొట్టమనేవాడు. కానీ ఏదో తెలియని ఫీలింగ్ నన్ను ఆపేది. దాన్ని పిరికితనమని మొదట్లో అనుకునేవాణ్ణి. హింసవైపు మొగ్గని హృదయ సంస్కారమని తర్వాతెప్పుడో అర్థమైంది.

**అది ఆగలేదు...**

బీఏ ఆనర్స్ తర్వాత గుంటూరు కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. తర్వాత అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో పనిచేశాను. లెక్చరర్‌ను అయినా కులవివక్ష వేధింపులు మాత్రం అలాగే ఉండేవి. ఉస్మానియాలో నేను పీహెచ్‌డీ చేయడానికి పదేళ్లు అడ్డుపడ్డారు. లెక్చరర్లని అడిగితే హెచ్‌ఓడీని అడగమనేవారు. ఆయన్ని అడిగితే 'వాళు చేర్చుకుంటానంటే నాదేముంది, నోటిఫికేషన్ రానీయ్' అనేవారు. కానీ నోటిఫికేషన్ వచ్చిన ప్రతిసారీ నాకు మొండిచేయే ఎదురైంది. చివరికి, ఎస్వీ వర్సిటీ వీసీ జీఎస్ రెడ్డి దయతలచి అనుమతిచ్చారు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి అదే యూనివర్సిటీకి వీసీగా చేశాను. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీకి డీన్‌గా రిటైరయ్యాను. ఇన్ని సాధించినా అడుగడుగునా ఏదో రూపంలో వివక్ష తప్పలేదు. వీసీగా ఉన్నప్పుడు కొందరు స్టూడెంట్స్ యూనియన్ నాయకులు అందరి ముందూ కులం పేరుతోనే తిట్టారు! సాహితీ లోకం కూడా ఇందుకు అతీతం కాదు. అయితే అందుకు నేనెప్పుడూ కుంగిపోలేదు. చరిత్ర, సామాజిక పరిణామాలేవీ తెలియనివాళ్ల అజ్ఞానాన్నే ప్రేమగా ప్రశ్నిస్తూ సాహిత్య సృజనకి పూనుకున్నాను. ఆ ప్రేమని నాలో పరిపూర్ణంగా నింపిన వ్యక్తి నా భార్య భాగీరథి.

**అంతటి విషాదం...**

నేను జీవితంలో నిలదొక్కుకోవాలని అమ్మ కలలుకంటే... నేను గొప్ప వ్యక్తినవుతానని నమ్మి, నన్నూ నమ్మించింది నా భార్యే. గుంటూరులో లెక్చరర్‌గా ఉన్నప్పుడు మహిళా స్త్రీ శిశుసంక్షేమశాఖ కోసం లెక్చరివ్వడానికి వెళ్లినప్పుడు ఆమె నాకు పరిచయమైంది. ఆమె అక్కడ అధికారిగా చేస్తుండేది. మొదటి రోజే మొదలైన స్నేహం... ఐదునెలలు తిరక్కుండానే పెళ్లిదాకా వచ్చింది. నేను వెళ్లి వాళ్ల నాన్నతో మాట్లాడాను. కులాలు వేరుకావడంతో ఆయన ఒప్పుకోలేదు. 'నువ్వు ఈ పెళ్లితో గడపదాటితే జన్మలో నీ మొహం చూడం' అన్నాడు కూతురితో. అయినా ఆమె నా వెంటే వచ్చింది. మా పెళ్లి మా అమ్మకీ ఇష్టం లేదు. అనంతపురంలోనే కాపురం పెట్టాం. ఇద్దరం ఉన్నతోద్యోగులం కాబట్టి ఆర్థిక ఇబ్బందులు లేవు కానీ... తన తొలి ప్రసవం అప్పుడు అటు వాళ్లమ్మకానీ, ఇటు మా అమ్మకానీ రాలేదు! బిడ్డపుట్టాక పలకరించేందుకైనా తన తల్లి రాకపోతే... లోలోపల ఎంతగా కుమిలిపోయిందో తెలియదుకానీ నాతో ఎప్పుడూ చెప్పుకోలేదు. అడిగితే 'నువ్వు నా తల్లికన్నా ప్రేమగా చూస్తున్నావ్... అంతకంటే ఏం కావాలి!' అనేది. వాళ్ళ అమ్మని తర్వాతెప్పుడూ తను చూడనేలేదు. ఆమె చనిపోయిన నెలరోజులకికానీ ఆ విషయం మాకు తెలియనివ్వలేదు! ఓ కూతురిగా ఆమెకి అంతకంటే పెద్ద విషాదం ఏముంటుంది?! ఆ బాధని గుండెల్లో దాచుకునే నాకూ, పిల్లలకీ ప్రేమ పంచింది. ఆ ప్రేమని నా కలంలో సిరాగా మిగిల్చి... పదేళ్లకిందట హృద్రోగంతో కనుమూసింది!

**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు...**

'ఊరబావి', 'ఆకలి' 'కులవృత్తి', 'అనంత' జీవనం వంటి గొప్ప సృజన సాహిత్యం అందించిన ఇనాక్‌ది వ్యాసాల్లోనూ అందె వేసిన చేయి! ఆధునిక సాహిత్యానికి సంబంధించి కథలూ, కవితల్ని కాకుండా వ్యాసాలనే ఎంచుకుని పీహెచ్‌డీ చేశారాయన. 'తెలుగు వ్యాస పరిణామం' అనే ఆ పరిశోధనని ఓ రిఫరెన్స్ బుక్‌గా భావిస్తుంటారు. ఆయన రాసిన 'తెలుగు కావ్యాలపైన జానపదుల విమర్శ'కీ మంచి పేరుంది. ఆయన 'విమర్శిని' వ్యాసం సంపుటిలో సాహిత్య విమర్శకి సంబంధించి కొత్త పద్ధతుల్ని ప్రతిపాదించబట్టే ఈ ఏడాదిగ్గాను కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. ఇనాక్ తన సృజన సాహిత్యానికి జ్ఞానపీఠ సంస్థ అందించే మూర్తిదేవి అవార్డూ, వ్యాసాలకి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డూ, మొత్తం సాహిత్య సేవలగ్గానూ 'పద్మశ్రీ' అందుకోవడం విశేషం!

## గోడలు మాట్లాడాలి!

గోడలు మాట్లాడుతున్న వేళ
రోడ్లు జనంతో కదలబారేవి
అడవి పాటల పల్లవయ్యేది
నదులు ఉప్పొంగి ప్రవహించేవి
సముద్రం ఆకాశాన్ని అవనికి చేర్చేది

గోడలు మూగబోయిన వేళ
దారులు మూసుకుపోయాయి
ప్రశ్నలు జైళ్లలో బంధించబడ్డాయి
నదుల జాడలు చెరిగిపోతున్నాయి
అడవి ఒంటరి ఆకాశమయింది



మరల గోడలు మాటాడాలి
నెత్తురంటిన వాక్యం నినాదమై
రాయబడాలి!

– కెక్యూబ్

## బరితెగిస్తున్న భూ కబ్జాదారులు



ఇబ్రహీంపట్నం డిసెంబర్ తేదీ 19ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన బొడ్డు పురుషోత్తం రెడ్డి ఐదు ఎకరాల భూమిని తన అమ్మమ్మ కొడుకు మామగారైన రాజేందర్ రెడ్డి వద్ద 2006వ సంవత్సరంలో 5 ఎకరాల 9 గుంటల భూమి మాల్ నుండి మర్రిగూడ వెళ్లే దారిలో కొనుగోలు చేయడం జరిగింది. ఇప్పుడు రాజిరెడ్డి అనే పేరుతో భూమికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి మూడు ఎకరాల 9 గుంటల భూమి కబ్జా చేసే ప్రయత్నాలలో స్థానిక రాజకీయ నేతలు వెనుక ఉండి, మనోహర్ రెడ్డి, జంగారెడ్డి, కొండల్ రెడ్డిలను ముందు ఉంచి భూ కబ్జా బాగోతాన్ని నడిపిస్తున్నారని బొడ్డు పురుషోత్తం రెడ్డి ఆరోపిస్తున్నారు. లేని రాజిరెడ్డి పేరుతో సృష్టించిన ఫేక్ భూపత్రాలపై సమగ్ర విచారణ జరిపించి, నకిలీ పత్రాలతో సీలింగ్, ప్రైవేటు భూముల కబ్జాకు యత్నిస్తున్న ముఠాపై చర్యలు తీసుకోవాలని పురుషోత్తం రెడ్డి తన వ్యవసాయ పొలంలో పత్రికా సమావేశం లో కోరారు. రెడ్డి రెడ్డి మనోహర్ రెడ్డి ఇబ్రహీంపట్నం కు చెందిన పొల్ జంగారెడ్డి, తక్కల్లపల్లి గ్రామానికి చెందిన మారేడుపల్లి కొండల్ రెడ్డి అనే వ్యక్తులకు విక్రయించాడని బొడ్డు పురుషోత్తం రెడ్డి తెలిపారు. అయితే సర్వే నెంబరు 565 లోని మొత్తం భూమి 1975 నుంచి మొదలుకొని 1995 వరకు సీలింగ్ లో ఉందని అన్నారు . సీలింగ్ లో ఉన్న భూమిని రెడ్డి రెడ్డి మనోహర్ రెడ్డి లేని బట్ట రాజిరెడ్డి వద్ద ఎలా కొనుగోలు చేశారని ప్రశ్నించారు. అయితే సీలింగులో ఉన్న భూములన్నీ బట్ట రాజేందర్ రెడ్డి పేరిట ఉండగా, రెడ్డి రెడ్డి మనోహర్ రెడ్డి మాత్రం తాను బట్ట రాజిరెడ్డి వద్ద కొనుగోలు చేసినట్లు ఫోర్జరీ పత్రాలను సృష్టించారని తెలిపారు. అసలు ఈ బట్ట రాజిరెడ్డి ఎవరో, ఆయనకు తన మేనమామ అయిన రాజేందర్ రెడ్డి కి ఉన్న సంబంధం ఏమిటో చెప్పాలన్నారు. ఆ పత్రాలపై ఉన్న సంతకాలు కూడా తమ మేనమామ అయిన బట్ట రాజేందర్ రెడ్డివి కావని తెలియజేశారు. ఫోర్జరీ పత్రాలను సృష్టించి తమ భూమిని కాజేయాలని చూస్తున్న రెడ్డి రెడ్డి మనోహర్ రెడ్డి, పొల్ జంగారెడ్డి, మారేడుపల్లి కొండల్ రెడ్డిలు ఒక ముఠాగా ఏర్పడి నన్ను చంపేసామని బెదిరిస్తున్నారని, మొత్తం ఐదు ఎకరాల తొమ్మిది గంటలు వదిలి వెళ్లాలని మా నాన్నను వాచ్ మెన్ ను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేశారని తెలిపారు. జంగారెడ్డి, కొండల్ రెడ్డిలపై నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేశారని, రెడ్డి రెడ్డి మనోహర్ రెడ్డి పై కేసు నమోదు చేయకుండా పోలీసులు కూడా కాల వ్యాపన చేశారని తెలిపారు. తమ భూమిని కబ్జా చేయడానికి ఈ ముగ్గురు బృందం ముఠా స్థానిక రాజకీయ నేతలను కూడా కలుపుకొని కుట్ర చేస్తున్నారని బొడ్డు పురుషోత్తం రెడ్డి తెలిపారు. దయచేసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి రెవెన్యూ అధికారులకు నా మనవి ఏమనగా నా యొక్క భూమి దస్తావేజులు పరిశీలించి మాకు తగిన న్యాయం చేస్తారని బొడ్డు పురుషోత్తం రెడ్డి పత్రికా సమావేశంలో తెలిపారు.

## వజ్రోత్సవ సంబరాలను విజయవంతం చేయండి




ఇబ్రహీంపట్నం డిసెంబర్ తేదీ 19ప్రజాపాలన ప్రతినిధి:గత 75 సంవత్సరాల సంఘ ప్రస్థానం లో ఉపాధ్యాయ హక్కులకై , విద్యా రంగ పరిరక్షణకై ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత ఎస్టీయూ సంఘానిదని, ఎన్నో శాశ్వత ప్రయోజనాలను ఉపాధ్యాయ లోకానికి అందించిందని,ఇక ముందు కూడా ఉపాధ్యాయ సమస్యల,విద్యారంగ పరిరక్షణకు ముందుండి నడిపిస్తుందని ఆ సంఘ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు మహేష్ అన్నారు.ఎస్టీయూ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26 న .యాం ఈ రెడ్డి గార్డెన్ వనస్థలిపురం లో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి స్థాయి వజ్రోత్సవ సంబరాల్ని విజయవంతం చేయాలని,ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని తెలియజేశారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎంపీపీ శ్రీ కృపేష్, ఎంపీడీవో జయరాం విజయ్,ఎంఈఓ శ్రీ వెంకట్ రెడ్డి ఏ ఈ ఇంద్రసేనా రెడ్డి గార్లచే గోడపత్రిక ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమం లో మండల ఎస్టీయూ అధ్యక్షులు మహేష్,ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్ , జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ ,యాదగిరి ,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు...

## తాటి చెట్టు పైనుండి కిందపడి వ్యక్తికి తీవ్ర గాయాలు



హుజురాబాద్ డిసెంబర్ 19 ప్రజాపాలన రిపోర్టర్ శంకరపట్నం: హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన పంజాల లక్ష్మయ్య గౌడ్ (59). సోమవారము వృత్తిరీత్యా తాడిచెట్టు కల్లు తీయడానికి తాడిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారిపడగా తాడిచెట్టు పైనుండి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక తొటి గీతకార్మికులు 108 ఫోన్ ద్వారా సమాచారము అందించగా హుటాహుటిన 108సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మయ్యకు ప్రథమ చికిత్స అందిస్తు హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# లైంగిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా యువజన, క్రీడల అధికారి హనుమంతరావు




వికారాబాద్ బ్యూరో 19 డిసెంబర్ ప్రజా పాలన : ఎయిడ్స్ బారిన పడకుండా యువత లైంగికంగా సంక్రమించే వ్యాధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి హనుమంతరావు తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో ఎయిడ్స్, క్షయ, కుష్ఠ వ్యాధిపై తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువతి యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ అనంతరం జిల్లాలో ఎయిడ్స్ వేగవంతంగా వ్యాప్తి చెందుతుందని, యువత దీనిపట్ల పూర్తి అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి అరక్షిత లైంగిక సంపర్కం వల్ల ఒకరి నుండి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ముందు జాగ్రత్తలు పాటిస్తూ మహమ్మారి బారిన పడకుండా సురక్షితంగా యువత ఉండాలన్నారు. దీనికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని తెలియజేశారు. ఎయిడ్స్ పట్ల జిల్లాలోని అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అవగాహన కలిగిన యువకులు తమ తోటి మిత్రులకు ఇరుగుపొరుగు వారికి, గ్రామస్థాయిలో ఉండే యువతకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి క్షయ, కుష్ట, ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. రవీందర్ మాట్లాడుతూ, ఎయిడ్స్ తో పాటు క్షయ, కుష్ఠ వ్యాధుల పట్ల కూడా ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే క్షయ వ్యాధికి సంబంధించిన టెస్టులు చేయించుకుని వ్యాధిని నిర్ధారించుకోవాలన్నారు. దగ్గుతో పాటు తేమడ, రక్తం పడటం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తెమడ పరీక్ష ఎక్సరేల ద్వారా వ్యాధి నిర్ధారించుకొని 6 నెలల పాటు చికిత్స పొందినట్లయితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఇట్టి వ్యాధి ఇతరులకు సోకే ప్రమాదం ఉందని తెలియజేశారు. జిల్లాలో ప్రస్తుతం1200 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన చికిత్సలు అందజేయడం జరుగుతుందన్నారు. క్షయ వ్యాధి మాదిరిగానే కుష్ఠ వ్యాధి కూడా గతంలో చాలా తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం ఈ వ్యాధిని అదుపు చేయడం జరిగిందన్నారు. ఈ వ్యాధి కూడా ఒకరి నుండి ఇంకొకరికి సోకుతుందని, స్పర్శ లేని మచ్చలు ఏమైనా ఉన్నట్లయితే, వెంటనే డాక్టర్ ను సంప్రదించి ఆరు నెలల నుండి సంవత్సరం పాటు చికిత్స పొందినట్లయితే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికీ 90 కేసులకు చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఎయిడ్స్, క్షయ, కుష్ఠ వ్యాధులు ఉన్నవారు సిగ్గుపడకుండా స్థానిక ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించి మెరుగైన చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ ఈసయ్య, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ రిసోర్స్ పర్సన్ నరసింహ స్వామి, ఎన్ఏపీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, తక్షశిల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమార్, ఐ సి టి సి కంట్రోలర్ రత్నాకర్, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి దీపారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ లేబర్ శాఖ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు భారీగా ప్రజలను సమీకరించాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



బోనకల్, డిసెంబర్ 19 ప్రజా పాలన ప్రతినిధి: ఈనెల ఖమ్మంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు మండలం నుంచి భారీగా ప్రజలను తరలించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సిపిఎం మండల స్థాయి విస్తృత సమావేశం మాజీ ఎంపీపీ చిట్టిమోదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ నెల 29వ తేదీన భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించనున్నట్లు, ఈ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయ్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 22 గ్రామాల నుంచి ప్రతి ఇంటి నుంచి జనం కదిలే విధంగా ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు, శ్రేణులు రాష్ట్ర మహాసభల జయప్రదమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. మహాసభల జయప్రదం కోసం జిల్లా వ్యాప్తంగా గత నెల రోజులుగా పెద్ద ఎత్తున విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు మహాసభ జయప్రదం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాలపై ఈ మహాసభలలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. బిజెపి అధికారంలోకి రాకుండా ఉండేందుకు దేశవ్యాప్తంగా సిపిఎం లౌకిక శక్తులతో కలిసి పోరాటాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలు అన్నింటిని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రతి కార్యకర్త బిజెపి ఓటమే లక్ష్యంగా పనిచేయవలసిన అవసరం ప్రస్తుత పరిస్థితులలో ఏర్పడిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను ప్రజా పోరాటాల ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశాన్ని మతతత్వ ఆధారంగా విడగొట్టాలని బిజెపి ప్రయత్నాన్ని లౌకిక పార్టీలన్నీ కలిసి తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై కూడా సిపిఎం నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాకుండా చేయటమే సిపిఎం లక్ష్యమన్నారు. కమ్యూనిస్టుల ఖమ్మం జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు రాష్ట్ర ప్రజా పోరాటాలకు వేదికగా మారనున్నాయన్నారు. జిల్లాలో వచ్చే సార్వత్రిక ఎన్నికలలో సిపిఎం వీలైనంత ఎక్కువ స్థానాలలో విజయం సాధిస్తుందని అందుకోసం ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పని చేయాలని పిలుపునిచ్చారు.

**పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.....**

ప్రతి ఒక్కరూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల జయప్రదమే లక్ష్యంగా పనిచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు కోరారు. రాష్ట్రస్థాయిలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా మహాసభలకు ప్రతి ఇంటి నుంచి జన సమీకరణ చేయాలన్నారు. ఈ మహాసభలో వచ్చే ఎన్నికలకు దిక్సూచిగా మారాలన్నారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా పోరాటాల నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీపీ కంకణాల సౌభాగ్యం సర్పంచులు కేతినేని ఇందు, ఆళ్ల పుల్లమ్మ, నోముల వెంకట నరసమ్మ, ఎంపీటీసీలు జొన్నలగడ్డ సునీత, కందిమల్ల రాధ, కర్లకుంట దేవమణి మండల కమిటీ సభ్యులు గూగుల్ నరేష్, బంధం శ్రీనివాసరావు, కిలారి సురేష్, మందడపు శ్రీనివాసరావు, ఏడునూతల లక్ష్మణరావు, పిల్లలమర్రి వెంకట అప్పారావు, గుగులోతు పంతు, పెద్దపోలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి: రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు



బోనకల్, డిసెంబర్ 19 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలోని మిర్చి పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోనే గార్లపాడు గ్రామంలో తాతా లక్ష్మీనారాయణ కు చెందిన మిర్చి పంట దెబ్బతిన్న కారణంగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో దెబ్బతిన్న పంటలకు ఆ ప్రభుత్వం ఇన్సూరెన్స్ చెల్లించి రైతులను ఆదుకుంటుందని, కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం రైతులకు ఇన్సూరెన్స్ చెల్లించడం లేదని, దీని వలన రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా జిల్లా వ్యాప్తంగా నల్లనల్లి, బొప్పరాగంతో మిర్చి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. కానీ ప్రభుత్వ మాత్రం రైతులను ఆదుకునే ఏ రకమైన చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. ఒక్కొక్క ఎకరానికి రైతులు లక్ష నుంచి లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టారని, కానీ అందులో 20 శాతం కూడా పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. దీనివలన అప్పుచేసి పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులు పాలవుతున్నారని, అప్పులు పాలైన అన్నదాతలు అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తమ ప్రభుత్వం రైతుబంధు చెల్లించి రైతులను లక్షాధికారులు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుండగా మరోవైపు రైతులు వ్యవసాయం చేయలేక అప్పులు పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి మిర్చికి లక్ష నుంచి లక్షన్నర పెట్టుబడి అవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి పదివేల రూపాయలు ఇస్తే రైతులు పెట్టిన మిగిలిన పెట్టుబడి పరిస్థితి ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పదివేల రూపాయల వల్ల రైతులకు జరిగిన ఉపయోగం ఏమీ లేదన్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందన్నారు. కౌలు 20 నుంచి 25 వేల రూపాయల వరకు చెల్లిస్తున్నారని, గతంలో రైతులకు ఇన్సూరెన్స్ చెల్లించేవారని కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఎందుకు ఎత్తివేసిందో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు కొమ్మినేని నాగేశ్వరరావు ,రైతులు దొండపాటి నాగేశ్వరరావు, గుడిపూడి వెంకటేశ్వర్లు, గండు సైదులు, తాత వీరయ్య, ముక్కపాటి నాగేశ్వరరావు, తాత వెంకయ్య, తాతా గోపయ్య, కిలారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: మేయర్ జక్క వెంకట్ రెడ్డి



మేడిపల్లి, డిసెంబర్ 19 (ప్రజాపాలన ప్రతినిధి):పీర్జాదిగూడ కమాన్ నుండి పర్వతాపూర్ వరకు సుమారు రూ 26.32 కోట్లతో నిర్మితమవుతున్న 4 లైన్ల రోడ్డు విస్తరణ,నిర్మాణ పనులను మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ డా. పి రామకృష్ణ రావు, హెచ్ఎండిఏ అధికారులు కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి కావాలని మేయర్ అధికారులను ఆదేశించారు.ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేసి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాల్సిందిగా పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఫేస్–2లో భాగంగా నిర్మిస్తున్న మంచి నీటి పైప్ లైన్ పనులను మేయర్ వెంకట్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, స్తంబాలు,ట్రాన్సుఫార్మర్లు ఎన్ని రోడ్లకు అడ్డంగా వస్తున్నాయో వాటి వివరాలు సేకరించి ఎక్కడైతే స్తంబాలు,ట్రాన్సుఫార్మర్లను షిఫ్ట్ చేయాల్సి ఉందో వెంటనే షిఫ్ట్ చేయాలని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎత్తు ఎక్కువగా ఉండే విద్యుత్ స్తంబాలు,బంచ్ కేబుల్స్ వేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సమస్యల పరిష్కరంలో నిర్లక్ష్యం చేయొద్దని మేయర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్,కార్పొరేటర్లు కౌడే పోచయ్య,మద్ది యుగేందర్ రెడ్డి,బచ్చ రాజు,దొంతిరి హరిశంకర్ రెడ్డి, ఏంపల్ల అనంత రెడ్డి, కొల్తూరి మహేష్,సుభాష్ నాయక్, నాయకులు మాడుగుల చంద్రారెడ్డి,దేవేందర్ గౌడ్,కుర్ర శ్రీకాంత్ గౌడ్,పప్పుల అంజిరెడ్డి, అలవాల దేవేందర్ గౌడ్,యాసారం మహేష్,జావీద్ ఖాన్, ఇంజనీర్లు,విద్యుత్ కాంట్రాక్టర్లు చంద్ర శేఖర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, విద్యుత్ అధికారులు,రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఊరడమ్మ జాతర ఘనంగా జరిగింది



చేవెళ్ల నియోజకవర్గం:(ప్రజాపాలన): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ గ్రామంలో సోమవారం ఊరడమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతరకు ముఖ్య అతిథులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, టి పి సి సి జనరల్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, వేణు గౌడ్, నియోజకవర్గం పిసిసి మెంబర్ రాచ మల్ల సిద్దేశ్వర్, షాబాద్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, తదితర ముఖ్య నాయకులు హాజరై దేవత మూర్తిని దర్శించుకుని వారి ఆశీస్సులు తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొండల్ యాదవ్ మాట్లాడుతూ.... గ్రామంలో 30 సంవత్సరాల క్రితం ఊరడమ్మ జాతరను ఈసారే ఘనంగా నిర్వహించామని మూడు రోజుల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని బోనాల ఊరేగింపు జరిపామని వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో ఉంచాలని కోరుకున్నామని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో .... మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ కేసరి ఛాంపియన్ విజేత అబుబకర్ బమాస్

**మన్నెగూడ ఎంపిటిసి సయ్యద్ ఆదిల్ ఆహ్మద్**



వికారాబాద్ బ్యూరో 19 డిసెంబర్ ప్రజాపాలన : తెలంగాణ కేసరి ఛాంపియన్ అబుబాకర్ బమాస్ విజేతగా నిలిచాడని మన్నెగూడ ఎంపిటిసి సయ్యద్ ఆదిల్ ఆహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కేసరి చాంపియన్ అబూబకర్ బమాస్ ను శాలువా కప్పి, భుజగదను అందజేసి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మన్నెగూడ ఎంపిటిసి సయ్యద్ ఆదిల్ ఆహ్మద్ మాట్లాడుతూ మన్నెగూడ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించే వారికి నా సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు. మన ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలు తేవడానికి ప్రతి క్రీడాకారుడు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని హితవు పలికారు. క్రీడలలో రాణించాలంటే శారీరకృత్వం ఏకాగ్రత సమయస్ఫూర్తి ధ్యానం వంటి అంశాలలో నిరంతర కృషి చేయాలని సూచించారు. గాలిలో దీపం పెట్టి ఫలితాలు రావాలని ఎవరూ కూడా ఆశించరాదని హెచ్చరించారు. స్వయం శక్తితో పట్టుదలతో సాధిస్తే విజయాలు తప్పక వరిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ కేసరి ఛాంపియన్షిప్ విజేతగా నిలిచిన అబూ బకర్ బమాస్ ను సన్మానించడం ప్రేరణగా నిలుస్తాడని స్పష్టం చేశారు. నా బృంద సభ్యులందరూ క్రీడల్లో రాణించే వారికి ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. శారీరక శ్రమ మీది సహకారం అందించేది మేము అన్న విషయము యువత మర్చిపోరాదని గుర్తు చేశారు. సమాజానికి ఉపయోగపడే విధంగా నేటి యువత సమయస్ఫూర్తితో మెలగాలని చెప్పారు. ఒక్క పథకముతో సంతృప్తి చెందక ఇలాంటి మరెన్నో పథకాలను భవిష్యత్తులో సాధించాలని ఆకాంక్షించారు. మన్నెగూడ ప్రాంతానికి కీర్తి ప్రతిష్ఠలు మంచి పేరు ప్రఖ్యాకులు తెచ్చే ప్రతి ఒక్కరికి నా సహాయ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి: వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల



వికారాబాద్ బ్యూరో 19 డిసెంబర్ ప్రజాపాలన : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో జిల్లా కలెక్టర్ నిఖిల ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పెట్టుకున్న అర్జీలను సంబంధిత అధికారులు ప్రాధాన్యమిచ్చి వేను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈరోజు ప్రజావాణిలో ధరణి,ఆసరా పెన్షన్లు, డబల్ బెడ్ రూమ్ లకు సంబంధించిన 70 దరఖాస్తులను ప్రజల నుండి సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు.

## చంద్రబాబు సభను విజయవంతం చేయాలి



మధిర డిసెంబర్ 19 (ప్రజా పాలన ప్రతినిధి) ఖమ్మం పట్టణంలో ఈ నెల 21న జరిగే టిడిపి ఉమ్మడి జిల్లా స్థాయి బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కోరారు. చంద్రబాబు నాయుడు సభను విజయవంతం చేయాలని కోరుతూ టిడిపి నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మధిర పట్టణ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు మాట్లాడుతూ భవిష్యత్ లో తెలంగాణ రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తుందని అన్నారు. టిడిపి అధికారంలో ఉంటేనే పేదవారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం జరుగుతున్న ఈ బహిరంగ సభకు టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో జరిగే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కూడా ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరి శేఖర్ బాబు, సాయి తులసి, మైనీడి జగన్, చెరుకూరి కృష్ణారావు, వీరమాచినేని నాగ సులోచన, పగిడిపల్లి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.


# ప్రజాపాలన

**జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.**

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | - | పాలేరు | - | 9848895405 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | - | ఎర్రుపాలెం మండలం | - | 8501020885 |
| బుక్య.శ్రీను | - | బోనకల్ | - | 8688810293 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9000178307 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| టి.సురేష్ చారీ | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| డి.భాస్కర్ | - | బెల్లంపల్లి | - | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | - | జన్నారం రూరల్ | - | 9493314399 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| గొడ్లబాబూరావు | - | తల్లాడ | - | 9848236015 |
| ఎల్.వెంకట్ | - | మందమర్రి | - | 8106891666 |
| మహమ్మద్ హాఫీజుద్దీన్ | - | కేతనపల్లి | - | 9701844456 |
| సాయిబాబు | - | భద్రాద్రి కొత్తగూడెం | - | 9603149645 |
| ఎన్.బండయ్య | - | చేవెళ్ల | - | 9959032940 |
| నరేందర్ | - | చేవెళ్ల | - | 9490148304 |
| ఎం.పరమేష్ | - | శంకరపల్లి | - | 7989723793 |
| ఊదిరి మహేష్ | - | చౌటుప్పల్ | - | 9550941419 |
| జి.అర్జున్ | - | శంకరపట్నం | - | 7386777544 |
| ఎం.యాదయ్య | - | చేవేళ్ల నియోజకవర్గం | - | 8328236516 |
| ఎం.మురళీ | - | షాబాద్ | - | 9989770468 |


## ఎల్లకొండలో ఘనంగా ఊరడమ్మ జాతర

**నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ యాదవ్**



వికారాబాద్ బ్యూరో 19 డిసెంబర్ ప్రజాపాలన : గ్రామ ప్రజలు పాడి పంటలతో సిరినంపదలతో సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లేందుకు గ్రామదేవత రక్షణ కవచంగా నిలుస్తుందని నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ యాదవ్ అన్నారు. సోమవారం నవాబుపేట మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో ఊరడమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు గత నాలుగు రోజుల నుండి కొనసాగుతున్నది. ఊరడమ్మ జాతర ఉత్సవాలను తిలకించేందుకు మన ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి తండోపతండాలుగా తరలివచ్చిన వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరడమ్మ జాతరను అంగరంగ వైభవంగా జరిపించడం జరుగుతుందన్నదని చెప్పారు. ఊరడమ్మ జాతరకు ముఖ్య అతిథులుగా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, టిపిసిసి జనరల్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, వేణు గౌడ్, చేవెళ్ల నియోజకవర్గం పీసీసీ మెంబర్ రాచమల్లు సిద్దేశ్వర్, షాబాద్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తదితర ముఖ్య నాయకులు గ్రామ దేవత ఊరడమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లకొండ గ్రామంలో గత 30 సంవత్సరాల క్రితం చేసిన ఊరడమ్మ జాతరను ఈసారి ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గత నాలుగు రోజుల నుంచి ఊరడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించామని దాంట్లో భాగంగానే బోనాల ఊరేగింపు నిర్వహించినట్లు తెలిపారు. దేవత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని పంటలు బాగా పండి సిరిసంపదలు కురవాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఎమ్మెల్యే



ఇబ్రహీంపట్నం డిసెంబర్ తేదీ 19ప్రజాపాలన ప్రతినిధి :సోమవారం రోజు ఇబ్రహీంపట్నం మంచి రెడ్డి. కిషన్ రెడ్డి ఎమ్మెల్యే రంగారెడ్డి జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్షుడు చేతుల మీదుగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ను 60000 రూపాయల ను బండ రావిరాల గ్రామానికి చెందినా కొత్త.శ్రీనివాస్ గౌడ్ కి అందజేయం జరిగినది ఈ కార్యక్రమంలో కొత్త.కిషన్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు మొలుగు.దానేష్ కావడి.దయాకర్ రెడ్డి మొదలుగువారు పాల్గొన్నారు,

## ప్రజలు ఐక్యమత్యంతో ఉండాలి



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి ప్రజలు ఐక్యమత్యంతో ఉండాలని తండ్రి ఎమ్మెల్యే శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. తాండూర్ జెపిఆర్ గార్డెన్ లో ఐక్యత క్రైస్తవ వేడుకల్లో ఆంధ్ర శాసనసభ్యుడు పైలెట్ రోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవుల అభివృద్ధి కోసం టిఆర్ఎస్ పార్టీ ఎంతో కృషి చేస్తాం ఆయన తెలిపారు. క్రైస్తవ మత పెద్ద పీటర్ మాట్లాడుతూ క్రైస్తవుల ఐక్యమత్యంతో ఉండే సంవత్సరం పరిష్కరించుకోవాలని దేవదాయ మహిమతో అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీవరత్నం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ చెయ్ సమస్యను పరిష్కరించుకో: మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్



వికారాబాద్ బ్యూరో 19 డిసెంబర్ ప్రజాపాలన : డయల్ యువర్ చైర్ పర్సన్ కార్యక్రమంలో భాగంగా ఫోన్ ద్వారా సమస్యలు తెలపితే పరిష్కరిస్తామని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా డయల్ యువర్ చైర్ పర్సన్ కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చినవి. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఒక్క ఫోన్ కాల్ తో సమస్యను పరిష్కరిస్తున్న చైర్ పర్సన్ కు ధన్యవాదాలు అని ప్రజలు తెలిపారని వివరించారు. గతంలో సమస్యలు పరిష్కారం కావాలంటే ఆఫీసుకు సెలవు పెట్టి మున్సిపల్ కార్యాలయం ముందు పడిగాపులు కాయాల్సి వచ్చేదని నష్టం చేశారు. ప్రజల కష్టాల కడలని ఒక్క ఫోన్ కాల్ తో పరిష్కరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కు అభివందనాలని ప్రజలు తెలిపారు. డయల్ యువర్ చైర్ పర్సన్ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను నేను మా మున్సిపల్ సిబ్బందితో కలిసి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. రాజీవ్ నగర్ కాలనీ స్మశాన వాటికకు వెళ్లడానికి దారి లేదని, ఎన్జీవోస్ కాలనీలో డ్రైనేజ్ సమస్య, మిషన్ భగీరథ వాటర్ సమస్య, వివిధ వార్డులలో స్ట్రీట్ లైట్లు, దోమల మందు, గడ్డి మందు పిచికారి చేయడం లాంటి సమస్యలను చైర్ పర్సన్ ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. సానుకూల దృక్పథంతో ఆలోచించిన చైర్ పర్సన్ సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిపిఓ శ్రీధర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మొహినుద్దీన్, ఏఈ రాజ్ కుమార్, మెప్మా వెంకట్, టిపిఎస్ వేణు, ఆర్వో శివ, మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్, యేసు, యాదయ్య, శ్రీను, రాజు, గోపాల్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



మేడిపల్లి, డిసెంబర్ 19 (ప్రజాపాలన ప్రతినిధి): ప్రస్తుత సమాజంలో ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవ్ ది చైల్డ్ ఆర్గనైజేషన్ వారి సౌజన్యంతో సెటప్ ల్యాబ్ ను మేయర్ జక్క వెంకట్ రెడ్డి, 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, పరిశీలన పెంపొందించుకోవడానికి శాస్త్రీయ భావనలు అనువర్తనాలను విద్యార్థులు పరిశీలించి ఆకలింపు చేసుకోడానికి ప్రయోగశాలలు అవసరమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ సత్య ప్రసాద్, హెచ్డిఎఫ్సి శ్రావణి వెంకట్ రెడ్డిల సహకారంతో ఈ ల్యాబ్ ను ఏర్పాటు చేయించినందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు నదియా జావిద్ ఖాన్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నియోజవర్గంలో పట్టు బిగిస్తున్న టిడిపి



మధిర రూరల్ డిసెంబర్ 19 ప్రజా పాలన ప్రతినిధి నియోజకవర్గ పరిధిలోరాజకీయ చైతన్యం కలిగిన మధిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం సాధించేందుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో మధిర టిడిపి పార్టీ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు నాయకత్వంలో ముమ్మరంగా కృషి చేస్తున్నారు. 80 సంవత్సరాల వయసును సైతం లెక్కచేయకుండా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ మధిర నియోజకవర్గంలో బలోపేతానికి చాప కింద నీరు లాగా పనిచేస్తున్నారు. మధిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. ప్రతి గ్రామంలో క్యాడర్ ఉంది. నాయకులు పార్టీలు మారినా కార్యకర్తలు మాత్రం తెలుగుదేశం లోనే కొనసాగుతున్నారు. ఆంధ్ర సరిహద్దున మధిర నియోజకవర్గం ఉండటంతో పాటు తెలుగుదేశం పార్టీ అంటే అభిమానం కలిగిన కమ్మ సామాజిక వర్గం, బడుగు బలహీన వర్గాలు అత్యధికంగా మధిర నియోజక వర్గంలో ఉన్నారు. ఈ సామాజిక వర్గాలకు పసుపు జెండా కనిపించినా, సైకిల్ గుర్తు కనపడ్డా కేరింతలు కొడుతూ ఆనందంలో ఊగిపోతారు. జిల్లాలో ఎక్కడలేని విధంగా మధిర మండలంలోని చిలుకూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు టిడిపిలో చేరటం విశేషం. డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు సమిష్టి నాయకత్వంతో కష్టపడి పని చేయడం వలన జిల్లాలో ఎక్కడలేని విధంగా మధిర మున్సిపాలిటీలో మూడు కౌన్సిలర్ స్థానాలను టిడిపి గెలుపొందింది. అదే విధంగా ఎంపిటిసి, సహకార సంఘం, సర్పంచ్ ఎన్నికల్లో పలుచోట్ల టిడిపి గెలుపొందింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా సమస్యలపై పోరాడుతూ మరోవైపు సామాజిక సేవా కార్యక్రమంలో టిడిపి ముందుంది. వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ, అన్నదానాలు ఏర్పాటు చేయటం లాంటి నిరంతరం ఏదో ఒక సేవా కార్యక్రమాల పేరుతో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు ప్రజల్లో ఉంటున్నారు. పరామర్శల పేరుతో కార్యకర్తలు కష్ట సుఖాల్లో డాక్టర్ వాసిరెడ్డి రామనాథం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటన చేస్తూ భరోసా నిలుపుతున్నారు. ఈనెల 21న చంద్రబాబు నాయుడు ఖమ్మంతో పాటు మధిర నియోజకవర్గం పరిధిలోని పాతర్లపాడు వస్తున్న తరుణంలో మధిర నియోజకవర్గం నుండి భారీ స్థాయిలో జన సమీకరణ చేసేందుకు జిల్లాలో ఎక్కడలేని విధంగా మధిరలో ప్రచార రథాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా ప్రధాన వీధుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆర్థికంగా బలంగా ఉండి లౌక్యంగా వ్యవహరిస్తూ, జూనియర్ సీనియర్ నాయకులను సమన్వయం చేసుకుంటూ మల్లాది హనుమంతరావు ముందుకు కొనసాగుతున్నారు టిడిపి పట్టణ బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే మధిరలో టిడిపిని కీలక శక్తిగా మార్చేందుకు ఎంతో వ్యూహంతో వ్యవహరిస్తూ కష్టపడి పని చేస్తున్నారు. మధిరలో తెలుగుదేశం పార్టీ మద్దతు ఉన్న పార్టీలే ఇప్పటివరకు ఎన్నికల్లో గెలుపొందుతూ వస్తున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి మధిర నియోజకవర్గాన్ని టిడిపికి కంచు కోటగా మార్చటమే తమ లక్ష్యం అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు పేర్కొన్నారు.

## వైరా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా: వైయస్సార్ టీపీ వైరా ఇంచార్జ్ రామ్ నాయక్..



వైరా, డిసెంబర్ 19 (ప్రజాపాలన న్యూస్): లివైరా నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైయస్సార్ తెలంగాణ పార్టీ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ధర్మసోత్ రామ్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన వైరాలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ అధినేత్రి వైయస్ షర్మిలమ్మ పాదయాత్ర చేపట్టిందన్నారు. ఈ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో షర్మిలమ్మ పోటీ చేస్తుందని, ఖమ్మం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. ఎమ్మెల్సీ తాత మధు నిరాధారణమైన ఆరోపణలు చేయటం సరైనది కాదన్నారు. బిజెపి, టిఆర్ఎస్ ప్రభుత్వాలపై తమ పార్టీ పోరాటాలు చేస్తుందని అన్నారు. గతంలో బిజెపి ప్రభుత్వానికి నల్ల చట్టాలు తీసుకొస్తే మద్దతు పలికింది టిఆర్ఎస్ కాదా అని విమర్శించారు. బిజెపికి వదిలిన బాణం షర్మిలమ్మ అని టిఆర్ఎస్ వారు విమర్శలు చేయటం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. నియోజకవర్గంలో వైఎస్ఆర్టిపి బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.లి

## అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయాస్తమాన పూజలు



మధిర రూరల్ డిసెంబర్19 (ప్రజాపాలన ప్రతినిధి ప్రతిని) మధిర పట్టణంలోని అయ్యప్ప నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో సోమవారం నాడు జరిగిన ఉదయాస్తమాన పూజల్లో కర్లపూడి వాసు దంపతులు పాల్గొన్నారు. స్వామివారి 15వ మండల పూజల్లో భాగంగా ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. అనంతరం మాలాదారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన దాత శీలం వెంకటరెడ్డి గోవర్ధన్ దంపతులు అయ్యప్ప స్వామి భక్తులకు, మాలధారులకు ఏర్పాటుచేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపిణి అన్నదానం అయ్యప్ప స్వాములు చేయటం అయ్యప్ప స్వామి కృప అందరికీ ఉండాలని వారు తెలిపారు అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథి విచ్చేసి కర్లపూడి వాసు. ఈ సందర్భంగా కర్లపూడి వాసు మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని, అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఆయన అన్నారు. పేదవాడి ఆకలి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ అన్నదానాలు చేయాలన్నారు. ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలదారులకు అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి దేవిశెట్టి రంగారావు పుల్లారావు నాగభూషణం సుబ్బారావు రమేష్ గాంధీ శ్రీనివాస్ కాశి వంకరపాటి నాగేశ్వరావు బాబు మేడం వెంకటేశ్వర రావు మైనీడి జగన్మోహన్ రావు స్వామి పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, గాంధీ స్వామి ఎంఆర్పి రావు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే అజ్మీర రేఖనాయక్ జన్మదిన వేడుకలు



జన్నారం, డిసెంబర్ 19, ప్రజాపాలన: నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అజ్మీనా రేఖనాయక్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ జన్నారం మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల ఎఆర్ఎస్ కళాశాల ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుల్వ జనార్ధన్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, జన్నారం ఎంపీటీసీ రియాజుద్దీన్, జన్నారం సర్పంచ్ భూషణవేని గంగాధర్ గౌడ్, నాయకులు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వడ్ల కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి



ఎరుపాలెం డిసెంబర్ 19 ప్రజాపాలన ప్రతినిధి ఎరుపాలెంమండలం ఎర్రుపాలెం మండలంకేంద్రం లో వ్యవసాయ మార్కెట్ నందు ఒడ్ల కొనుగోలు కేంద్రాన్ని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. కేంద్రం ఇస్తున్న రైతులకు గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం రైతులపట్ల నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నది. ఈ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా తరుగు ఇతర ఖర్చులు భారం వేస్తున్నది.ఇక్కడ మౌలిక వసతులు లేవు కనీసం వర్షం వస్తే తగిన సదుపాయాలు లేవు. ఒడ్లు ఆరుదలకు ప్లాట్ ఫామ్స్ లేవు అని కిసాన్ మోర్చా సంబంధిత అధికారాలను నిలదీసినది. వెంటనే రైతులకు న్యాయం జరగాలని ప్రభుత్వాన్ని బిజెపి కిసాన్ మోర్చా డిమాండ్ చేస్తున్నది.ఈ కార్యక్రమం లో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూతక్కి నరసింహారావు, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరావు, రాష్ట్ర %ంఎ% మోర్చా కార్యదర్శి పెరుమాళ్లపల్లి విజయరాజు, బిజెపి జిల్లా కార్యదర్శి ఎర్రుపాలెం ఇంచార్జి చిలివేరు సాంబశివరావు, మండల అధ్యక్షులు ముక్కపాటి శ్రీనివాసరావు,జిల్లా అధికారప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరావు, కిసానమోర్చా మండల అధ్యక్షులు మిరియాల నాగేశ్వరావు,దళితమోర్చా జిల్లా కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు, ఓబీసీ మండల అధ్యక్షులు రామకృష్ణ,పార్టీ ఉపాధ్యక్షులు బొక్కా రమేష్, మల్లెల మోహనరావు, మిరియాల వెంకటేశ్వర్లు, కోటా మర్తి ధర్మ, కొండలరావు హేమ, మరియు రైతులు పాల్గొన్నారు.

# దివ్యాంగునికి ఆర్థిక సాయం అందజేత



తల్లాడ, డిసెంబర్ 19 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన భూక్య మనోజ్ అనే నిరుపేద దివ్యాంగునికి విజయ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును సేవా సంస్థ చైర్మన్ దొబ్బల శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తల్లాడ మండలంలోని రామచంద్రాపురం గ్రామ కార్యదర్శి సురేష్, ఐకెపిసిసి కురివెళ్ల నరసింహారావు, అంగన్వాడి ఆశ కార్యకర్తలు, గ్రామదీపిక సత్తెనపల్లి చిన్న వేలాద్రి తదితరులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగ సుధా, సభ్యులు అనుమోలు రాంబాబు, బాబాసాహెబ్, రవి, రమ్య, కళ్యాణి పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు సిపిఎం పార్టీలో చేరికలు



ఇబ్రహీంపట్నం డిసెంబర్ తేదీ 19 ప్రజాపాలన ప్రతినిధి:ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తున్న సిపిఎం పార్టీకి ఆకర్షితులైన మంతన్ గౌరెల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు సిపిఎం పార్టీలో చేరికయాచారం పార్టీ ఆఫీసులో వీరికి సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి మధుసూదన్ రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య మండల కార్యదర్శి ఏ నర్సింహా మండల కార్యదర్శివర్గ సభ్యులు చందు నాయక్, మండల కమిటీ సభ్యులు కే తావు నాయక్ గార్లు శాలువలు కప్పి వాటిలోకి ఆహ్వానించినారుఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి మధుసూదన్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిపిఎం పార్టీ ఎమ్మెల్యేలు అసైన్మెంట్ కమిటీల ద్వారా వందలాది ఎకరాల భూములు పేదలకు పంచిన చరిత్ర ఎర్రజెండాకుంది . అప్పట్లో సాధించినటువంటి భూములకు ధరణి వచ్చిన తర్వాత ప్రభుత్వ అసైన్మెంట్ భూములకు నేటికీ ధరణి పాసుబుక్కులు రాకపోవడం దుర్మార్గం భవిష్యత్తులో ఎర్ర జెండా నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం చేసి భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

పార్టీలో చేరిన వారిలో

1. చంద్రం 2 ఎడ్ల లక్ష్మయ్య 3. లాలు.4. జి మల్లయ్య.5. గాంస్య .6. ఎం నర్సింహా.7. సిలిమ.8. సుగుణ.9. రాము.10. కృష్ణ 11. బి దశరథ.12 గంస్య 13. సక్రు.14. సామ.15. భాస్కర్.16 బిచ్చ.17 ఖాలు .18 చిన్న .19. సేవ .20. గోపాల్ 22. శ్రీకాంతు. 23. శ్రీను.24 బాలు . 25. పంతు. గ్రామ పార్టీ నాయకులు . దేవుజీ తదితరులు వున్నారు.,

## బీసీ బిల్లు పై బీసీ ఎంపీలు పార్లమెంట్లో నిలదీయాలి

### బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్



మంచిర్యాల బ్యూరో, డిసెంబర్19, ప్రజాపాలన:బీసీ బిల్లు పై బీసీ ఎంపీలు పార్లమెంట్లో నిలదీయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోనిబెల్లంపల్లి చౌరస్తా ప్రాంతంలో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టే విధంగా బీసీ ఎంపీలు ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని అన్నారు. పార్లమెంటులో ప్రస్తుతం 90 మంది బీసీలు ఎంపీలుగా కొనసాగుతున్నారని , బీసీ బిల్లు పై పార్లమెంటులో ప్రస్తావించకుంటే బీసీ ఎంపీలను ద్రోహులుగా ప్రకటిస్తామని హెచ్చరించారు. అనేక సంవత్సరాలుగా బీసీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పించాలని ఉద్యమాలు నడుస్తుంటే బీసీలుగా పార్లమెంటులో ప్రతినిత్యం వహిస్తున్న ఎంపీలు బీసీ బిల్లు పై ప్రభుత్వాన్ని నిలదీయకపోవడం బాధాకరం. అన్నారు. దేశంలో ఉన్న 75 కోట్ల మంది బీసీల ఆకాంక్షను పార్లమెంటులో వినిపించాలని కోరుతున్నాం, అదేవిధంగా 1931లో బ్రిటిష్ ప్రభుత్వం బీసీ జనగనణ చేపడితే దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న బీసీ జనగనణపై గతంలో ఉన్న ప్రభుత్వాలు బీసీ జనగణపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక , నాయకులు లక్ష్మణ్, ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ జైపాల్ సింగ్, శ్రీపతి రాములు, కల్వ చెర్ల నాగభూషణ,చారి రాస మల్ల కుమార్,మొగిలి రాజేందర్, అశోక్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారంలో తెలుగుదేశం పార్టీ



మధిర డిసెంబర్ 19 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో ఇంటింటా ప్రచారం లో ఈనెల 21న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు ఈనెల 21న ఖమ్మంలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ ఉమ్మడి జిల్లా స్థాయి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు సోమవారం మధిర పట్టణంలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ నిర్మాణాత్మక బలోపేతం దిశగా రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు అనంతరం సాయంత్రం 6 గంటలకు మధుర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రచారాన్ని చేపడుతున్న నాయకులు కార్యకర్తలు గ్రామాలలో పార్టీ అభిమానులను భారీ ఎత్తున తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. వాసిరెడ్డి రామనాథం నేతృత్వంలో ప్రచారాలను ముమ్మరం చేసింది సోమవారంఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమం రాయపట్నం సెంటర్ నుండి డాక్టర్ వాసిరెడ్డి ప్రారంభించగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకురాలు సాయి తులసి చేకూరి శేఖర్ బాబు మైనీడి జగన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మల్లాది హనుమంతరావు చెరుకూరి కృష్ణారావు కౌన్సిలర్లు వంకాయలపాటి నాగేశ్వరరావు వీరమాచినేని నాగ సులోచన పగిడిపల్లి విజయమ్మ కాశి రావు, నాయకులు గడ్డం మల్లేశ్వరరావుతోపాటు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజలకు అతి తక్కువ ధరకే త్రాగునీరు అందించడం అభినందనీయం: మాజీ కౌన్సిలర్ కోనా సుచరిత



మధిర డిసెంబర్ 19 ప్రజ్ఞా పాలన ప్రతినిధి: మధిర పట్టణ ప్రజలకు కేవలం ఐదు రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందించడం ఎంతో అభినందనీయమని మాజీ కౌన్సిలర్ కోన సుచరిత పేర్కొన్నారు సోమవారం పట్టణంలోని 15వ వార్డులో కటకం రాఘవాచారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విగ్నేశ్వర సాయి బాలాజీ వాటర్ ప్లాంట్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లాభపేక్ష లేకుండా, సేవా మార్గంతో ప్రజలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటుచేసిన సాయి బాలాజీ వాటర్ ప్లాంట్ ముందు ముందు మరింత అభివృద్ధి సాధించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోన ధని కుమార్ ప్లాంట్ అధినేత కటకం రాఘవాచారి విజయ్ తదితరులు పాల్గొన్నారు

## అలాంటి టైమ్ లో షూటింగ్..
## రవితేజ ది గ్రేట్ అంటున్న శ్రీలీల..!



రవితేజ కమిట్మెంట్ గురించి ధమాకా ప్రీ రిలీజ్ ఈవెట్ లో ఆడియన్స్ తో పంచుకున్నారు హీరోయిన్ శ్రీలీల. ఆయనతో జత కట్టి చేసిన ఈ ధమాకా సినిమాని నక్కిన త్రినాథరావు డైరెక్ట్ చేశారు. కన్నడలో యువ హీరోయిన్ గా రెచ్చిపోతున్న శ్రీలీల తెలుగులో పెళ్లిసందడి సినిమాలో నటించింది. ఆ మూవీతో ఆడియన్స్ ని మెప్పించిన అమ్మడు రవితేజ ఛాన్స్ అందుకుంది. రవితేజ సినిమా సెట్స్ మీద ఉండగానే అమ్మడు మరో రెండు సినిమాల ఛాన్స్ లు అందుకుంది. ఇక ధమాకా సినిమా టైం లో రవితేజ ఎనర్జీ.. ఎఫర్ట్స్ గురించి శ్రీలీల బాగా చెప్పింది. ఒక సాంగ్ షూటింగ్ లో కాలికి 12 కుట్లు దాకా పడినా సరే ఆ పెయిన్ ఎక్కడా కనిపించకుండా రవితేజ నటించారని.. తనకు ఇష్టమైన హీరో రవితేజ అని అన్నారు శ్రీలీల. ఈ కష్టం ఏంటి అసిస్టెంట్ డైరెక్టర్ గా మొదలు పెట్టిన అతని కెరీర్ స్టార్ గా మారిన టైం వరకు మాస్ మహరాజ్ రవితేజ కెరీర్ లో ఎన్నో రిస్క్ లు ఉన్నాయి. 12 కుట్లు పడినా డ్యాన్స్ చేశారని శ్రీలీల రవితేజ కష్టం గురించి చెప్పగా.. అతన్ని చిన్న పాత్రల నుంచి స్టార్ గా ఎదిగేంతవరకు చూసిన ప్రేక్షకులు.. ఆ కష్టం తో పోల్చితే ఇదేమంత కష్టం కాదులే అనుకుంటున్నారు. మొదటి సినిమాతోనే తెలుగు ఆడియన్స్ మనసులు దోచేసిన శ్రీలీల ధమాకాతో డబుల్ ధమాకా ఇవ్వనుంది. ఈ సినిమా హిట్ అయితే మాత్రం అమ్మడికి వరుస ఛాన్సులు వస్తాయని చెప్పొచ్చు. అమ్మడి దూకుడు చూస్తుంటే శ్రీలీల టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా మారడం పక్కా అని చెప్పొచ్చు. తెలుగులో ఇప్పటికే వరుస ప్రాజెక్ట్ లు సైన్ చేస్తుంది శ్రీలీల. శ్రీలీల నెక్స్ట్ ఇయర్ నుంచి ఎక్కడికో వెళ్తుందని రవితేజ కూడా అన్నారు. ఎంతో టాలెంట్ ఉన్న నటి అని.. తప్పకుండా ఆమె చాలా గొప్ప స్థాయికి వెళ్తుందని అన్నారు రవితేజ. త్రినాథ రావు నక్కిన డైరెక్షన్ లో ఎంటర్టైనర్ మూవీగా వస్తున్న ధమాకా ట్రైలర్ సినిమాపై ఆసక్తి కలిగేలా చేసింది.

## విలన్ ని హీరోగా ప్రమోట్ చేస్తున్న శంకర్!



ఖైదీ మాస్టర్ విక్రమ్ వంటి బ్లాక్ బస్టర్ సినిమాల్లో నెగెటివ్ షేడ్స్ వున్న పాత్రల్లో నటించి మంచి పేరు తెచ్చుకున్న తమిళ నటుడు అర్జున్ దాస్. ప్రస్తుతం సితార ఎంటర్ టైన్ మెంట్స్ మలయాళ మూవీ 'కప్పెల' ఆధారంగా తెలుగులో రీమేక్ చేస్తున్న 'బుట్టబొమ్మ' మూవీతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడు. ఇందులోనూ నెగెటివ్ షేడ్స్ వున్న ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నాడు. కొన్ని సినిమాల్లో విలన్ గానూ నటించిన అర్జున్ దాస్ ని ప్రముఖ దర్శకుడు శంకర్ హీరోగా ప్రమోట్ చేస్తున్నాడు. అర్జున్ దాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'అనీతి'. వసంత బాలన్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో దుశ్శార విజయన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ మూవీ గురించి తెలుసుకున్న దర్శకుడు శంకర్ స్వీయ నిర్మాణ సంస్థ ఎస్. పిక్చర్స్ పై సమర్పకుడిగా వ్యవహరించడానికి ముందుకొచ్చారు. ఆదివారంసోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ శంకర్ ఓ పోస్టర్ ని విడుదల చేశారు.

## ధనుష్ హీరోగా 'రాధేశ్యామ్'!



ప్రభాస్ హీరోగా వచ్చిన రాధే శ్యామ్ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచిన విషయం తెల్సిందే. దాదాపుగా మూడు సంవత్సరాల పాటు దర్శకుడు రాధాకృష్ణ ఆ సినిమాను రూపొందించాడు. ఓ టైటానిక్ రేంజ్ లో సినిమా ఉంటుంది అన్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు సినిమా ప్రమోషన్ సమయంలో ప్రచారం చేశారు. కానీ సినిమా తీవ్రంగా నిరాశ పరిచింది. రాధేశ్యామ్ డిజాస్టర్ అవ్వడంతో దర్శకుడు రాధాకృష్ణ పరిస్థితి ఏంటో అంటూ అంతా ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సమయంలో ఆయన సినిమా అప్డేట్ అందరిని ఆశ్చర్యపర్చుతోంది. రాధాకృష్ణ తన తదుపరి సినిమాను తమిళ సూపర్ స్టార్ ధనుష్ తో చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడట. ఆయన నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చిందనే వార్తలు వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ధనుష్ ద్వి భాషా చిత్రాలు అది కూడా తెలుగు మరియు తమిళం లో సినిమాలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నాడు. అందుకే ఇప్పటికే సార్ సినిమా ను చేస్తున్నాడు.. ఆ సినిమా తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సినిమాను చేసేందుకు ధనుష్ కమిట్ అయ్యాడు. ఇవే కాకుండా మరికొన్ని తెలుగు సినిమాలు కూడా ధనుష్ చేస్తాడట. అందులో భాగంగానే రాధేశ్యామ్ దర్శకుడు రాధాకృష్ణ దర్శకత్వంలో సినిమాను చేసేందుకు కమిట్ అయ్యాడు అనే వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం తన వద్ద ఉన్న కథను ధనుష్ కు చెప్పిన రాధాకృష్ణ ఓకే చెప్పించుకున్నాడట. కానీ ప్రస్తుతానికి డేట్లు లేకపోవడంతో హోల్డ్ లో ఉంచాడట. అతి త్వరలోనే ధనుష్ నుండి స్పష్టమైన గ్రీన్ సిగ్నల్ రావడం ఖాయం అనే నమ్మకంతో రాధాకృష్ణ వెయిట్ చేస్తున్నాడట. రాధా కృష్ణ రాధేశ్యామ్ తో నిరాశ పర్చినా కూడా ఒక మంచి టెక్నీషియన్ అని మాత్రం పేరు దక్కించుకున్నాడు. కనుక కచ్చితంగా ఈసారి ఆయన దర్శకుడిగా సక్సెస్ అయ్యి ధనుష్ కి సక్సెస్ ఇస్తాడేమో చూడాలి.

## డీఎస్పీ బాలీవుడ్ లోనూ తడబడ్డాడు!



'ఉప్పెన'..'పుష్ప' తర్వాత రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ మార్క్ సంగీతం ఎక్కడా కనిపించలేదు. సినిమాని ముందే మ్యూజికల్ గా హిట్ చేసే దేవి కొన్ని నెలలుగా ఈ విషయంలో తపబడుతున్నట్లే కనిపిస్తుంది. ఇప్పటికే 'వాల్తేరు వీరయ్య' లో బాస్ పార్టీ సాంగ్ చిరంజీవి ఇమేజ్ తో పాపులర్ అయిపోయినా? ఆ మాస్ నెంబర్ దేవి మార్క్ ఎక్కడా అంటూ ప్రశ్నించారు. దేవి గాత్రానికి శ్రోతలు కాస్త కంగారు పడ్డారు. ఇదే సినిమా నుంచి 'నువ్వు శ్రీదేవి..నేను చిరంజీవి' అంటూ సాగే మరో లిరికల్ సింగిల్ రిలీజ్ కానుంది. ఆ పాటలోనైనా దేవి మార్క్ కనిపిస్తుందని అభిమానులంతా ఆశిస్తున్నారు. ఈ పాటతో తనలో రియల్ ట్యాలెంట్ ని బయటకు తెస్తాడని ఆశలు పెట్టుకున్న వేళ...బాలీవుడ్ సాంగ్ తో ముందొస్తుగానే నిరుత్సాహ పరచడం హాట్ టాపిక్ గా మారింది. బాలీవుడ్ లో 'సర్కస్' చిత్రంలో ఓ పాటకు సంగీతం వహించే అవకాశం కారవడంతో ..ఆ చాన్స్ ని దేవి శ్రీ సద్వినియోగం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సినిమాకు ముగ్గురు సంగీత దర్శకుల్లో ఒకరగా దేవి కూడా ఉన్నారు. అయితే హిందీ సినిమాపై గా ఒక్క పాటకే సంగీతం అందించడంతో దేవి ప్రతిభ అంతా ఒక్క పాటలోనే కనిపిస్తుందని ఉత్తరాది సహా దక్షిణాది శ్రోతలు చాలా ఆశలే పెట్టుకున్నారు. కానీ వాటన్నింటిని ఒక్కసారిగా నీటి ఆవిరిలా చల్లార్చేసాడు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'సన్ జరా' ఇటీవల విడుదలైంది. ఈ పాటకు రెస్పాన్స్ అంతంత మాత్రంగానే ఉంది. అసలే సినిమాకి సరైన బజ్ కూడా లేదు. కనీసం డీఎస్పీ సాంగ్ తో నైనా రీచ్ అవుతుందని చాలా మంది ఆశలు పెట్టుకున్నా...అక్కడా నీరు గార్చేసాడు. ఆపాటకి శ్రోతల నుంచి సరైన ఫీడ్ బ్యాక్ రావడం లేదు. రొటీన్ సాంగ్ అని లైట్ తీసుకుంటున్నారు. సర్కస్ ఈ శుక్రవారం విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికే ట్రైలర్ పేలవంగా ఉండటంతో.. సినిమాకి హైప్ గ్రౌండ్ లెవెల్లో ఏమాత్రం కనిపించలేదు. కనీసం రాక్ స్టార్ అయినా పైకి లేపుతాడనుకుంటే ఆయనకూడా తుస్సు మనిపించాడు.

## మెగా క్యాంప్ లో కబాలి చేరిందా?



మెగా క్యాంప్ లోకి కబాలి చేరిందా? కోలీవుడ్ సంచలనం పా రంజిత్ మెగాస్టార్ ని మెప్పించే పనిలో ఉన్నాడా? అంటే అవుననే టాక్ వినిపిస్తుంది. కబాలి హిట్ తో ఒక్కసారిగా ఫేమస్ అయ్యాడు యంగ్ డైరెక్టర్ పా. రంజిత్. కెరీర్ ఆరంభంలోనే సూపర్ స్టార్ రజనీ కాంత్ తన కథతో మెప్పించి కబాలీ లాంటి యాక్షన్ ఎంటర్ టైనర్తో హిట్ అందుకున్నాడు. అదే నమ్మకంతో ఆ వెంటనే రజనీ మరో సినిమాకి పనిచేసే అవకాశం కల్పించాడు. అదే కాలా ముంబై గ్యాంగ్ స్టర్స్ నేపథ్యంలో తెరకెక్కిన సినిమా భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా వాటిని అందుకోవడంలో విఫలమైంది. దీంతో రంజిత్ వేగానికి ఒక్కసారిగా బ్రేక్ పడింది. ఆ తర్వాత రెండు..మూడు సినిమాలు చేసాడు గానీ అవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. అయితే ఇప్పుడీ నయా మేకర్ దృష్టి చిరంజీవిపై పడినట్లు తెలుస్తోంది. ఇటీవలే రంజిత్ మెగాస్టార్ ని కలిసి ఓ భారీ యాక్షన్ నేపథ్యమెన్న స్టోరీ నేరేట్ చేసారుట. ఆ కథపై చిరంజీవి కూడా పాజిటివ్ గానే స్పందించారని సమాచారం. స్టోరీ ఎగ్జైటింగ్ గా ఉండటంతో చేద్దామని ప్రామిస్ చేసినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే చిరంజీవిని తెరపై కొత్తగా ఆవిష్కరించే ప్రయత్నమనుకోవచ్చు. పా రంజిత్ రొటీన్కి భిన్న మైన యాక్షన్ సినిమాలు చేస్తాడు. తనలో ఆ క్వాలిటీనే రజనీతో అవకాశం కల్పించింది. ఇప్పుడా క్రేజ్ తో చిరంజీవి స్టోరీ కూడా నేరెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇటీవిలి కాలంలో చిరంజీవి కూడా దర్శకుల విషయంలో అప్ డేట్ గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. కథల పరంగా అప్డేట్ అయ్యారు. గాడ్ ఫాదర్ లాంటి వ్యవస్థల్నిరూల్ చేసే కథల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో పా రంజిత్ చిరంజీవి సరికొత్తగా ఆవిష్కరించడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం చిరంజీవి బాబి దర్శకత్వంలో వాల్తేరు వీరయ్య లో నటిస్తున్నాడు. అలాగే భోళా శంకర్ లోనూ నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాలు రిలీజ్ అయిన తర్వాత కొత్త ప్రాజెక్ట్ ల విషయంలో క్లారిటీ రానుంది. ఇటీవలి కాలంలో చిరంజీవి సినిమాలు వేగంగా పూర్తి చేస్తోన్న సంగతి తెలిసిందే.

## సొట్టబుగ్గల తాప్సీకి ఇగో ఎక్కువే!



మనిషన్నాక..కూసింత కళాపోషణ ఉండాలోయ్ అన్నట్లు...మనిషి అన్న వాడికి ఎవరికైనా ఈగో కూడా కూసింత ఉండాలోయ్. మరీ ఇగో లోకపోతై ఎదుట వాళ్లకి లోకువైపోం అన్న నానుడి ఉన్నదే. అలాగని ఈగో తోనే బ్రతుకుతాను? అంటే అంతకన్నా పెద్ద ప్రమాదమే పొంచి ఉంటుందన్నది గ్రహించాలి. సరిగ్గా ఇదే ప్రమాదంలో ఉంది సొట్టబుగ్గల తాప్సీ. అవును ఈ బ్యూటీకి ఈగో గ్రాముల్లో కాదు.. కిల్లోలోనూ కాదు..ఏకంగా టన్నుల్లోనే ఉందిట. ఇగోకి పోయిందంటే? ఎంత దూరమైనా వెళ్తుందిట. అంతు చూసే వరకూ వదిలి పెట్టదంట. కానీ తనలో ఆ ఇగోని పొగొట్టేది మాత్రం తన మనసుకు నచ్చిన కథ అంటోంది. అలాంటి కథ ఏ దర్శకుడైనా చెప్పగలిగితే ఆ దర్శకుడికి పొర్లుదండాలు కూడా పెట్టేస్తుందిట. అలాంటి సమయంలో తన మనసులోకి ఇగో భావన రాదుట. పూర్తిగా దర్శకుల హీరోయిన్ గా మారిపోతుందిట. పాత్ర ఎలా ఉంటుంది? బడ్జెట్ ఎంత? బ్యానర్ ఏంటి ? వంటి అంశాలు అస్సలు ఆలోచించదట. తన కెరీర్ గురించి ఎవరెలాంటి విమర్శలు చేసినా లైట్ తీసుకుంటుందిట ఆ సమయంలో. ఒక మంచి సినిమా చేయాలన్న ఉద్దేశం తప్ప ఇంకెలాంటివి తన కంటికి కనిపించవట ఆ సందర్భంలో. అలాగే తనకున్న ఈగో ని తనదైన శైలిలో సమర్ధించుకునే ప్రయత్నం చేసింది. కెరీర్ ఎవరికీ పూల దారి కాదని.. ఎవరైనా తప్పొప్పులు చేస్తారని..ఏ పనిచేసినా నూరుశాతం ఎవరిని తృప్తి పరచలేమని... అలాంటి సమయాల్లో వచ్చిన ప్రతీ విమర్శ గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని..అందులోనూ ఇగోయిస్టిక్ అంటే అస్సలు పట్టించుకోనని కుండబద్దలు కొట్టేసింది. మొత్తానికి తాప్సీ లోచాలా యాంగిల్స్ ఉన్నాయినని తెలుస్తోంది. బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత వాటిని ఒక్కొక్కటిగా బయటకు తీస్తుంది. తనలో డేరింగ్ నెస్ గురించి ఇప్పటికే రివీల్ చేసింది. బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ లా మాటలు తుటాల్లా పేల్చగల సమర్ధురాలని పలు సందర్భాల్లోనూ రుజువు చేసింది. ఆ రకంగా బాలీవుడ్ లో నవ నాయికలకు రోల్ మోడల్ గానూ నిలుస్తోంది.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB — SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989